www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను

18సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మండలాల వారీగా విలేకరులు కావలెను..

★ ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన నంబర్ ★

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 209 | మంగళవారం 29.09.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

# ఖైరతాబాద్ బైపోల్..

## అమిత్ షా పర్యటనతో పెరిగిన ఆసక్తి

### బైపోల్‌తో పార్టీల బలాబలాలపై చర్చ
### మూడు పార్టీల వ్యూహాలకు కీలక పరీక్ష



దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ కావడంతో ఉపఎన్నికకు రాజకీయ వేదిక సిద్ధమైంది. సాధారణ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ.. ఈ బైపోల్‌ను మూడు ప్రధాన పార్టీలూ ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం ఉంది. అభ్యర్థి ఎంపిక, స్థానిక నాయకత్వం, క్యాడర్ సమన్వయం, బూత్ స్థాయి బలం వంటి అంశాలు ఫలితంపై ప్రభావం చూపనున్నాయి.ఖైరతాబాద్ సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో ఉండటంతో బీజేపీ వ్యూహంపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గంలో మరోసారి అసెంబ్లీ ఉపఎన్నిక రావడంతో.. పార్టీ స్థానిక బలాన్ని ఎలా వినియోగిస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది. గత జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ ప్రదర్శన నేపథ్యంలో ఖైరతాబాద్‌లో పార్టీ ఎలాంటి మార్పులతో ముందుకు వెళ్తుందనేది ఆసక్తికరంగా మారింది.మరోవైపు కాంగ్రెస్ అధికార పార్టీగా స్థానాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నించనుండగా, బీఆర్ఎస్ తన పాత రాజకీయ ప్రభావాన్ని తిరిగి చాటుకునే వ్యూహంతో రంగంలోకి దిగే అవకాశం ఉంది. బీజేపీ మాత్రం హైదరాబాద్‌లో తన పట్టును విస్తరించేందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకునే ప్రయత్నం చేయనుంది. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్ ఉపఎన్నిక కేవలం ఒక నియోజకవర్గ పోటీగా కాకుండా.. హైదరాబాద్ రాజకీయాల్లో మూడు పార్టీల బలాబలాలు, వ్యూహాలు, నాయకత్వ సమన్వయాన్ని పరీక్షించే రాజకీయ వేదికగా మారే అవకాశం ఉంది.

- ఖైరతాబాద్ బరిలో కొత్త రాజకీయ సమీకరణాలు
- బైపోల్‌తో పార్టీల బలాబలాలపై చర్చ
- గ్రేటర్ రాజకీయాల్లో ఖైరతాబాద్‌కు ప్రాధాన్యం
- మూడు పార్టీల వ్యూహాలకు కీలక పరీక్ష
- అభ్యర్థుల ఎంపికపై మొదలైన ఉత్కంఠ
- క్యాడర్ సమన్వయంపై పార్టీల దృష్టి
- బీజేపీ బూత్ స్థాయి బలం పరీక్ష
- జూబ్లీహిల్స్ తర్వాత ఖైరతాబాద్‌పై ఫోకస్
- సికింద్రాబాద్ పరిధిలో మరో బైపోల్
- బీజేపీ వ్యూహంపై ఆసక్తికరమైన చర్చ
- కేంద్ర నాయకత్వం జోక్యంపై ఉత్కంఠ

02

క్యాడర్ సమన్వయంపై పార్టీల దృష్టి

బీజేపీ బూత్ స్థాయి బలం పరీక్ష

## లోకల్ రిజర్వేషన్లపై సుప్రీం క్లారిటీ

### నాలుగేళ్ల విద్యాభ్యాసం తప్పనిసరన్న సుప్రీం

- తెలంగాణ లోకల్ రిజర్వేషన్‌పై సుప్రీంకోర్టు కీలక స్పష్టత
- నాలుగేళ్ల విద్యాభ్యాసం తప్పనిసరన్న సుప్రీంకోర్టు
- రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారమే స్థానిక రిజర్వేషన్లు
- తెలంగాణ ప్రభుత్వ నిర్ణయానికి సుప్రీంకోర్టు మద్దతు

02







# ఎలక్షన్ కమిషన్ బీజేపీకి తొత్తు

### ఈసీపై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు.. ప్రజాస్వామ్యానికి ముప్పంటూ ధ్వజం

ఈసీకి కాంగ్రెస్ నేతలు వినతిపత్రం సమర్పణ

### ఓట్ల అక్రమాలపై కాంగ్రెస్ దేశవ్యాప్త పోరు

- ఈసీ తీరుపై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం
- ప్రజాస్వామ్యానికి ముప్పంటూ మహేష్ గౌడ్ ఫైర్
- సీఈసీ రాజీనామాకు కాంగ్రెస్ నేతల డిమాండ్
- బీజేపీకి ఈసీ అనుకూలమంటూ కాంగ్రెస్ ఆరోపణ
- ఓట్ల అక్రమాలపై కాంగ్రెస్ దేశవ్యాప్త పోరు
- రాజ్యాంగ ప్రతితో కాంగ్రెస్ నేతల నిరసన
- ఎన్నికల పారదర్శకతపై కాంగ్రెస్ నేతల డిమాండ్

03

ఓటర్ల భవిష్యత్తుపై ఆందోళన.. ఎన్నికల వ్యవస్థపై కాంగ్రెస్ ప్రశ్నలు

# అందుకే తెలుగుదేశం పార్టీలో చేరా

## అసెంబ్లీకి వెళ్లిన దానికంటే జైలుకే ఎక్కువసార్లు వెళ్లా

### విద్య వల్లే అంబేడ్కర్ రాజ్యాంగం రచించారు.. తెలంగాణలో బీజేపీకి ప్రాధాన్యం లేదు




- ఢిల్లీలో రేవంత్ కీలక వ్యాఖ్యలు.. రాజకీయాలపై ఆసక్తికర చర్చ
- తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్‌దే బలమన్న రేవంత్
- తన రాజకీయ ప్రయాణాన్ని వివరించిన సీఎం రేవంత్
- టీడీపీ నుంచి కాంగ్రెస్ వరకు రేవంత్ రాజకీయ ప్రస్థానం
- ఓట్ల తొలగింపుపై కేంద్రాన్ని ప్రశ్నించిన రేవంత్
- పేదల ఓటు హక్కుపై రేవంత్ తీవ్ర ఆందోళన
- దేశవ్యాప్తంగా ఓట్ల తొలగింపుపై సీఎం ఆరోపణలు
- 2029 ఎన్నికలపై ఓటర్ల జాబితా అంశం ప్రస్తావన

03

'ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్'లో రేవంత్ ప్రసంగం

# దిమ్మతిరిగే ఫలితం వస్తుంది

### బైపోల్‌లో ఊహించని ఫలితం ఖాయమన్న దానం

- ఖైరతాబాద్‌లో కాంగ్రెస్‌దే ఘన విజయమన్న దానం
- బైపోల్‌లో ప్రత్యర్థులకు షాక్ తప్పదన్న దానం
- ఖైరతాబాద్‌లో ఊహించని ఫలితం వస్తుందన్న ధీమా
- బీజేపీపై ఓటు చోరీ ఆరోపణలు చేసిన దానం
- సీఈసీ రాజీనామా చేయాలని దానం నాగేందర్ డిమాండ్
- ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయన్న దానం
- కిషన్ రెడ్డి గెలుపుపై దానం సంచలన ఆరోపణలు
- ఎన్నికల సంఘం తీరుపై దానం తీవ్ర విమర్శలు

03






# కేఆర్ఎంబీ సమావేశం వాయిదా..

## అక్టోబర్ 1 సమావేశం వాయిదా వేయాలని లేఖ

- కేఆర్ఎంబీ భేటీ వాయిదాకు తెలంగాణ విజ్ఞప్తి
- కేబినెట్ భేటీతో కేఆర్ఎంబీకి డుమ్మా
- అక్టోబర్ 1 సమావేశం వాయిదా వేయాలని లేఖ
- కొత్త తేదీ ఖరారు చేయాలని తెలంగాణ వినతి
- కేఆర్ఎంబీ సమావేశంపై తెలంగాణ కీలక లేఖ
- కేబినెట్ భేటీతో నీటిపారుదల శాఖ బిజీ

05

### కొత్త తేదీపై కేఆర్ఎంబీ నిర్ణయం కోసం ఎదురుచూపు

# వచ్చేది చలి కాలం కాదు..

## అక్టోబర్‌లోనూ 40 డిగ్రీల టెంపరేచర్!

### నవంబర్‌లోనే చలి మొదలు.. అప్పటివరకు ఉక్కపోతే

లోటు వర్షపాతం

20 నుంచి 15 శాతానికి తగ్గినా..

రైతులకు దక్కని ఫలితం



- కుంభవృష్టితో ఉపయోగం కంటే నష్టమే ఎక్కువ
- కృష్ణా, గోదావరికి తగ్గిన వరదలు.. ప్రాజెక్టుల్లో తగ్గుతున్న నీటి మట్టాలు
- శ్రీరాంసాగర్‌లో ఆశించిన స్థాయిలో చేరని నీళ్లు
- సాగర్‌లోనూ తగ్గుతున్న నీటి నిల్వలు
- శ్రీశైలంలో 93 టీఎంసీలు.. డెడ్‌స్టోరేజీకి చేరువలో నీటి నిల్వలు
- ఎండాకాలం నీటి కష్టాలు తప్పవా?
- సాగునీటిపై టెన్షన్.. తాగునీటికి పొదుపే దారి
- ఎగువ రాష్ట్రాల్లోనూ వర్షాభావమే.. తెలంగాణకు తప్పని నీటి గండం
- అన్‌సీజనల్ వర్షాలే ఇక ఆశాకిరణం
- వర్షాకాలం ముగిసినా.. వానలకు ఛాన్స్

02

# రీసర్వే ఏకైక మార్గం



## 413 గ్రామాల్లో దశల వారీగా భూ సర్వే

- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం సర్వేతోనే
- ప్రతి భూ పార్సిల్‌కు ప్రత్యేక గుర్తింపు
- జియో మ్యాపింగ్‌తో భూ రికార్డుల ఆధునీకరణ
- భూ సర్వేతో హద్దుల వివాదాలకు చెక్
- ఆధునిక పరికరాలతో సర్వేకు వేగం
- సాదాబైనామాల సమస్యలకు సర్వేతో పరిష్కారం
- ప్రతి ఆస్తి హద్దులపై స్పష్టతే లక్ష్యం

02

# ఉప ఎన్నిక.. గెజిట్ విడుదల.!




- దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- 2024 ఏప్రిల్ 23 నుంచే ఖాళీగా ఖైరతాబాద్ సీటు
- అధికారికంగా గెజిట్ విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం
- ఉప ఎన్నిక షెడ్యూల్‌పై ఎన్నికల సంఘం నిర్ణయం

03

# స్కూళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

## వారానికోసారి పనుల పురోగతిపై సమీక్ష



గడువులోగా స్కూళ్లు అందుబాటులోకి తేవాలి

87 నియోజకవర్గాల్లో స్కూళ్లకు అనుమతులు

70 స్కూళ్లలో ఇప్పటికే నిర్మాణ పనులు

ప్రతి స్కూల్‌కు ప్రత్యేక వర్క్ క్యాలెండర్

వారానికోసారి పనుల పురోగతిపై సమీక్ష

నిర్మాణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

03

# వచ్చేది చలి కాలం కాదు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో వర్షాకాలం ముగిసింది. నైరుతి రుతుపవనాలు కూడా పూర్తిగా వాపస్ వెళ్లిపోయాయి. ఎల్ నినో ఎఫెక్ట్‌తో ఈ ఏడాది చెప్పుకోదగిన స్థాయిలో పెద్ద వర్షాలేవీ పడలేదుకొద్దిరోజుల క్రితం ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో పలు జిల్లాల్లో అతిభారీ వర్షాలు పడ్డాయి. దీంతో లోటు వర్షపాతం 20 శాతం నుంచి15 శాతానికి తగ్గింది. కానీ రాష్ట్రమంతా విస్తారంగా పడకపోవడం, పడినచోట ఒకేసారి కుంభవృష్టిలా కురవడంతో పంట పొలాలకు పెద్దగా కలిసి రాలేదు. మరోవైపు అక్టోబర్ నెలలో ఎండలు తీవ్రంగా ఉంటాయన్న ఆందోళనలు వ్యక్తవ-ఎవుతున్నాయి.పీక్ చలికాలం నవంబర్‌లోనే మొదలవుతుందని అధికారులు చెబుతున్నారు. అప్పటివరకు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు రికార్డయ్యే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే టెంపరేచర్లు సాధారణం కన్నా మూడు నాలుగు డిగ్రీలు ఎక్కువగానే నమోదవుతున్నాయి. 37 డిగ్రీల మార్క్‌ను చేరుకుంటున్నాయి. ఉక్కపోత తీవ్రంగా ఉంటున్నది. గాలిలో తేమ వంద శాతం వరకు నమోదవుతున్నది. రాబోయే రోజుల్లో ఉక్కపోత తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. చలికాలం మొదలు కావాల్సి ఉన్నా మొదలు కాలేదు. చలి తీవ్రత నవంబర్ లోనే పెరగొచ్చని అధికారులు అంచనావేశారు. అప్పటివరకు అంటే అక్టోబర్ నెలంతా కూడా ఎండాకాలం మాదిరే 40 డిగ్రీల ఉష్ణోగ్రత , ఈ క్రమంలోన మండే ఎండలు,ఉక్కపోత ఉంటాయని చెబుతున్నారు.

**అకాల వర్షాలు పడే చాన్స్**

వర్షాకాలం సీజన్ ముగిసిపోయినా అక్టోబర్, నవంబర్ నెలల్లో అన్ సీజనల్ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనాలు చెబుతున్నాయి. ఆ వర్షాలతో రాష్ట్రానికి కొంతలో కొంతైనా ఊరట లభించే చాన్స్ ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక, ఎగువన మహారాష్ట్ర, కర్నాటకల్లోనూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కృష్ణా, గోదావరి నదులకు పెద్దగా వరదలు రాలేదు. ముఖ్యంగా శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల కింద ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. శ్రీశైలంలోనూ నీటి నిల్వ వేగంగా పడిపోతున్నది.ప్రస్తుతం ప్రాజెక్టులో 93 టీఎంసీల నిల్వ ఉండగా.. డెడ్ స్టోరేజ్‌కు ఎగువన ఇంకా కేవలం 40 టీఎంసీల నీళ్లున్నాయి. ఎండాకాలం వరకు తాగునీటి కోసం నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉన్నా.. ఏపీ మాత్రం నీటిని తోడడం ఆపడం లేదు. పోతిరెడ్డిపాడు నుంచి 3,800 క్యూసెక్కులు, హంద్రీనీవా మల్యాల లిఫ్ట్ నుంచి 3,000 క్యూసెక్కుల నీటిని ఏపీ తరలించుకుంటున్నది. ఇటు సాగర్‌లోనూ డెడ్‌స్టోరేజ్‌కు ఎగువన 48 టీఎంసీల నిల్వ ఉన్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకైతే ఈ ఏడాది సరైన వరదన్నదే రాలేదు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టులో 80 టీఎంసీలకుగాను 47 టీఎంసీల నీళ్లే ఉన్నాయి. అంటే వాడుకోవడానికి ఇంకో 40 టీఎంసీల వాటర్ అందుబాటులో ఉన్నాయి.

# రీసర్వే ఏకైక మార్గం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో భూసమస్యల శాశ్వత పరిష్కారానికి భూసర్వే ఏకైక పరిష్కారమార్గమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు ప్రకటించారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి మార్గనిర్దేశం ప్రకారం భూసమస్యలకు సంబంధించి దీర్ఘకాలిక సమస్యల్లో కొన్నింటిని ఇప్పటికే పరిష్కరించడం జరిగిందని త్వరలో మరికొన్నింటికి పరిష్కారం చూపిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా నాలుగు గోడల మధ్య ఆలోచన చేయకుండా ప్రజల కోణంలో ఆలోచన చేసి సమస్యను పరిష్కరిస్తున్నామని అన్నారు. భూ భారతి చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి భూ పార్శిల్‌కు ప్రత్యేక గుర్తింపు, జియో కోఆర్డినేట్స్‌తో కూడిన మ్యాప్, ఎల్‌పీఎం నంబర్ అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి గారు వివరించారు.వనపర్తిలో సోమవారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ , హౌసింగ్ అంశాలపై సమీక్ష అనంతరం మంత్రి పొంగులేటి తన సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు.రాష్ట్రంలో ధరణి చట్టం వలన ప్రజలకు కలిగిన అసౌర్యాలు,అవస్థలను రూపుమాపుతూ భూభారతి పోర్టల్ లో పేర్కొన్నవిధంగా భూధార్ కార్డులను అందించడమే ధ్యేయంగా ఈ ప్రజా ప్రభుత్వం సర్వే కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. భూ భారతి కింద 70 రెవెన్యూ గ్రామాలను తొలి దశలో సర్వేకు ఎంపిక చేయగా, రాష్ట్రంలో నక్షాలు అందుబాటులో లేని సుమారు 413 రెవెన్యూ గ్రామాలను కూడా దశలవారీగా సర్వే చేసే కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. భూ సర్వేను వేగవంతం చేసేందుకు అత్యాధునిక సాంకేతిక పరికరాలను ప్రభుత్వం పెద్ద ఎత్తునసమకూర్చిందని మంత్రి తెలిపారు. తొలి దశలో కొనుగోలు చేసిన రోవర్లతో పాటు రెండో దశలోనూ అదనపు రోవర్లను సమకూర్చి, జిల్లాల వారీగా అవసరానికి అనుగుణంగా అందిస్తున్నామని చెప్పారు.అలాగే వేలాది మంది సర్వేయర్లకు లైసెన్సులు మంజూరు చేసి క్షేత్రస్థాయిలో సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సర్వేయర్లు ఎలాంటి రాజకీయ ప్రచారాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వ కార్యక్రమంలో భాగసా-ఏ్వములై రైతులకు శాశ్వత ప్రయోజనం చేకూర్చాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.దశాబ్దాలుగా సాగులో ఉన్నప్పటికీ సరైన టైటిల్ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల సమస్యలను కూడా గుర్తించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.సాదాబైనామాలు, భూ హద్దుల వివాదాలు, పాత రికార్డుల్లోని లోపాలు, అబాది ఆస్తుల వివరాలు వంటి గ్రామీణ ప్రాంత సమస్యలకు సమగ్ర సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం చూపవచ్చన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రికార్డులు, మ్యాపులను ఆధునీకరించడం భూ భారతి లక్ష్యమన్నారు.గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, నివాస ప్రాంతాలు, అబాది ఆస్తులపై గతంలో విస్తీర్ణానికి సంబంధించిన స్పష్టమైన మ్యాపింగ్ లేకపోయిన సందర్భాలు ఉన్నాయని మంత్రి చెప్పారు. ఇకపై సర్వే ద్వారా ఆ ఆస్తి ఎన్ని గజాల్లో ఉంది, దాని హద్దులు ఎక్కడున్నాయి అనే వివరాలను మ్యాప్‌తో సహా రికార్డుల్లో పొందుపరుస్తామని తెలిపారు. భూ భారతి చట్టం అబాది, వ్యవసాయేతర భూములకు ప్రత్యేక రికార్డులు నిర్వహించడం, వాటి మూలలను జియో-కోఆర్డినేట్లతో మ్యాప్ చేయడం కోసం నిబంధనలు కలిగి ఉందని వివరించారు. ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయాలకు తావులేదు భూ సమస్యల పరిష్కారంతో పాటు పేదల సొంతింటి కలను సాకారం చేయడంలోనూ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి తెలిపారు. తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే రెండు లక్షలకు పైగా ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లను కూడా లక్ష్యబద్ధంగా పూర్తి చేస్తామని చెప్పారు. రెండో విడతలో నిర్మాణం ప్రారంభించే ఇళ్లలో గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పేదల ఇళ్లకు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. "ఊరు గుడిసె లేని రాష్ట్రం" చేయాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమన్నారు.రెండో విడతలో అవకాశం రాని అర్హులైన పేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆర్థిక పరిస్థితులు ఎన్ని సవాళ్లు ఎదురైనా మూడో విడత, నాలుగో విడతల ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

# ఖైరతాబాద్ బైపోల్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాల్లో ఖైరతాబాద్ ఉపఎన్నిక మ-రోసారి హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతను సుప్రీంకోర్టు సమర్థించడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా మారింది. దీంతో త్వరలో ఉపఎన్నిక జరిగే అవకాశం కనిపిస్తోంది. దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వ్యవ హారంపై హైకోర్టు అనర్హత వేటు వేయగా.. సుప్రీంకోర్టు కూడా ఆ తీర్పులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్ పోరు కేవలం ఒక అసెంబ్లీ స్థానానికి పరిమితమైన ఉపఎన్నికగా కాకుండా.. రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలకు కీలక రాజకీయ సమీకరణాలను పరీక్షించే వేదికగా మారే అవకాశముంది. సాధారణ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, ఉపఎన్నికల్లో వచ్చే ఫలితాలు ఆయా పార్టీల వ్యూహాలు, స్థానిక నాయకత్వం, క్యాడర్ సమన్వయం, పట్టణ ఓటర్ల మూడ్‌పై చర్చకు దారితీయడం సహజం. ముఖ్యంగా హైదరాబాద్ నగర రాజకీయాల్లో ఖైరతాబాద్‌కు ఉన్న ప్రాధాన్యతతో ఈ ఎన్నికపై ఆసక్తి మరింత పెరిగింది.

**కిషన్ రెడ్డి చుట్టూ ఎందుకు చర్చ?**

ఖైరతాబాద్ నియోజకవర్గం సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో ఉంది. ఈ లోక్‌సభ స్థానానికి కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత జి. కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఖైరతాబాద్ ఉపఎన్నికలో బీజేపీ అనుసరించే వ్యూహం, అభ్యర్థి ఎంపిక, స్థానిక నాయకత్వ సమన్వయం వంటి అంశాలపై సహజంగానే కిషన్ రెడ్డి పాత్రపై చర్చ జరుగుతోంది.అయితే దీనిని వ్యక్తిగతంగా ఒక నాయకుడి ఎన్నికగా చూడటం కంటే.. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ తన సంస్థాగత బలాన్ని ఎలా వినియోగించుకుంటుందనే కోణంలో చూడాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఇదే లోక్‌సభ పరిధిలో గతంలో జరిగిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బీజేపీకి ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు.

**జూబ్లీహిల్స్ ఫలితం.. ఇప్పుడు ఖైరతాబాద్‌పై ప్రభావం?**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి 25,866 ఓట్లు సాధించారు. అయితే 2025లో జరిగిన ఉపఎన్నికలో అదే అభ్యర్థి 17,061 ఓట్లకు పరిమితమ-య్యారు. ఓట్ల సంఖ్యలో తగ్గుదలతో పాటు బీజేపీ మూడో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ అభ్యర్థి వి. నవీన్ యాదవ్ 98,988 ఓట్లతో గెలుపొందగా, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత 74,259 ఓట్లు సాధించారు.జూబ్లీహిల్స్ ఫలితాన్ని బీజేపీకి ఒకే కారణంతో అన్వయించడం కంటే.. స్థానిక సమీకరణాలు, అభ్యర్థి ఎంపిక, పార్టీ క్యాడర్ పనితీరు, ప్రత్యర్థి పార్టీల వ్యూహాలు వంటి అనేక అంశాల సమ్మిళిత ఫలితంగా చూడాలి. అయితే ఆ ఫలితం తర్వాత ఇప్పుడు ఖైరతాబాద్‌లో బీజేపీ ఎలాంటి వ్యూహాన్ని అమలు చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

**బీజేపీ వ్యూహంలో మార్పు ఉంటుందా?**

తెలంగాణలో పార్టీని మరింతగా సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా బీజేపీ నాయకత్వం ఇటీవల కీలక మా-ర్పులు చేసింది. సునీల్ బన్సల్‌ను తెలంగాణ ఇన్‌చార్జిగా కొనసాగిస్తూ, అభయ్ పాటిల్, రేఖా శర్మలను కో-ఇన్‌చార్జిలుగా నియమించింది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు, భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ సంస్థాగత పునర్వ్యవస్థీకరణ జరిగిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఈ నేపథ్యంలో ఖైరతాబాద్ ఉపఎన్నిక బీజేపీకి స్థానికంగా తన బలం, నాయకుల మధ్య సమన్వయం, బూత్ స్థాయి వ్యవస్థను పరీక్షించుకునే అవకాశంగా మారనుంది. ముఖ్యంగా సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో మరో కీలక అసెంబ్లీ స్థానంలో పార్టీ పనితీరు ఎలా ఉంటుందన్నది రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షిస్తోంది.

**అమిత్ షా పర్యటనపై ఆసక్తి**

ఇదే సమయంలో తెలంగాణలో బీజేపీ కేంద్ర నాయకత్వం పర్యటనలు కూడా ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. అమిత్ షా తెలంగాణ పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలపై పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో సంస్థాగత విస్తరణ, స్థానిక సంస్థల ఎన్నికలు, భవిష్యత్ అసెంబ్లీ సమీకరణాలపై కేంద్ర నాయకత్వం దృష్టి పెట్టిన నేపథ్యంలో.. ఖైరతాబాద్ ఉపఎన్నిక అంశం కూడా పార్టీ వ్యూహ చర్చల్లో చోటు దక్కే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మొత్తంగా చూస్తే.. దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్‌లో ఏర్పడిన ఖాళీ ఇప్పుడు మూడు పార్టీలకు కొత్త రాజకీయ సమీకరణాలకు వేదికగా మారింది. కాంగ్రెస్‌కు అధికారంలో ఉన్న పార్టీగా స్థానిక బలాన్ని నిలబెట్టుకోవాల్సిన అవ-సరం ఉండగా, బీఆర్ఎస్‌కు తన పాత స్థానాన్ని తిరిగి సాధించే ప్రయత్నం కీలకం కానుంది. బీజేపీ విషయానికి వస్తే సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో తన రాజకీయ స్థావరాన్ని మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. అందుకే ఖైరతాబాద్ ఉపఎన్నికపై అభ్యర్థి ఎవరనే దానికంటే.. మూడు పార్టీలు ఎలాంటి వ్యూహంతో రంగంలోకి దిగుతాయన్నదే అసలు ఆసక్తికర అంశంగా మారుతోంది.

# భద్రాద్రి డీఈవోగా శంభూ శ్రీ ప్రసాద్





**కొత్తగూడెం,ఫ్లాష్ ఇండియా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారిగా శంభూ శ్రీ ప్రసాద్ ను నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్గా పనిచేస్తున్న శంభూ శ్రీ ప్రసాద్ కి జిల్లా విద్యాశాఖ అధికారి అదనపు బాధ్యతలు ( ఎఫ్ ఏ సి ) గా నియమించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారిణిగా డీ.వాసంతిని బదిలీ అయ్యారు. తాజా ఉత్తర్వుల ప్రకారం ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలకి నూతన డీఈవోలుగా విధుల్లో చేరనున్నారు.

# రూట్ మార్చి నిర్మానుష్య ప్రాంతానికి..

- మహిళపై క్యాబ్ డ్రైవర్ లైంగిక దాడికి యత్నం..



**శంషాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లోని శంషాబాద్ ప్రాంతంలో ఘోరం వెలుగుచూసింది. ప్రయాణికురాలిపై క్యాబ్ డ్రైవర్ లైంగిక దాడికి యత్నించడంతో పాటు ఆమె వద్ద ఉన్న రూ. 60 వేల నగదుతో పరారయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. గచ్చిబౌలికి చెందిన మహిళ(35) వ్యక్తిగత పనిపై రూ.60 వేలు బ్యాగ్‌లో పెట్టుకుని.. ఆదివారం సాయంత్రం క్యాబ్ ఎక్కింది. తొండుపల్లి టోల్‌ప్లాజా వద్ద డ్రైవర్ హఠాత్తుగా రూట్ మార్చాడు. వాహనాన్ని కొత్వాల్‌గూడ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఆమెపై దారుణానికి ఒడిగట్టేందుకు ప్రయత్నించాడు. తీవ్ర భయాందోళనకు గురైన సదరు మహిళ వెంటనే ధైర్యం చేసి కారులోంచి కిందకు దిగి గట్టిగా కేకలు వేసింది. దీంతో డ్రైవర్ బాధితురాలి వద్ద ఉన్న రూ. 60 వేల నగదు ఉన్న బ్యాగ్‌ను లాక్కుని అక్కడి నుంచి వేగంగా పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.ఈ తరహా దిగ్భ్రాంతికర ఘటనల నేపథ్యంలో ఒంటరిగా ప్రయాణించే మహిళలు పలు జాగ్రత్తలు పాటించడం అవసరం. క్యాబ్ ఎక్కే ముందే వాహనం నంబర్, డ్రైవర్ వివరాలను కుటుంబ సభ్యులకు లేదా మిత్రులకు షేర్ చేయాలి. ప్రయాణ సమయంలో జీపీఎస్ లొకేషన్ ఆన్‌లో ఉంచుకోవాలి. డ్రైవర్ నిర్ణీత మార్గాన్ని కాదని వేరే రూట్‌లోకి వెళ్తుంటే వెంటనే ప్రశ్నించాలి. ఏదైనా విపత్కర పరిస్థితి లేదా ప్రమాదం అనిపిస్తే వెంటనే భయపడకుండా 'డయల్ 112'కు సమాచారం అందించాలి. తెలంగాణ పోలీసులు అందుబాటులోకి తెచ్చిన 'హాక్ ఐ' యాప్‌లోని అత్యవసర బటన్‌ను ఉపయోగించడం వల్ల పోలీసులకు తక్షణమే సమాచారం చేరుతుంది. రాత్రి వేళల్లో ప్రయాణించేటప్పుడు అపరిచిత వాహనాలు, ప్రైవేటు క్యాబ్‌ల పట్ల మహిళలు ఎల్లప్పుడూ అత్యంత అప్రమత్తంగా ఉండాలి.

# గోదావరిలో పెరిగిన వరద ఉధృతి..

**గోదావరి,ఫ్లాష్ ఇండియా :** గోదావరి నదికి పెరుగుతున్న వరద ఉధృతి అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రభావం చూపుతోంది. పి.గన్నవరం మండలంలోని కనకాయలంక కాజ్వేపైకి వరద నీరు చేరడంతో కాజ్వే పూర్తిగా జలమయమైంది. దీంతో కోనసీమ జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు వెళ్లే రాకపోకలు నిలిచిపోయాయి. ముఖ్యంగా లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు గోదావరిలోకి చేరడంతో కోనసీమలోని గోదావరి, వైనతేయ, వశిష్ట, గౌతమి, వృద్ధ గౌతమి పాయలన్నింటిలోనూ నీటి ప్రవాహం పెరిగింది. వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఎప్పటికప్పుడు వరద పరిస్థితులను సమీక్షిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.మ-రోవైపు వరద ఉధృతి మరింత పెరిగితే అయినవిల్లి ఎదురుబిడియం కాజ్వేపైకి కూడా వరద నీరు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరం లేకుండా వరద నీటిలోకి వెళ్లవద్దని, కాజ్వేలపై ప్రయాణాలు చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నారు. కాగా, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద జలాల ప్రభావంతో ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రస్తుతం బ్యారేజ్ వద్ద నీటిమట్టం 11 పాయింట్ 6,0 అడుగులకు చేరుకుని మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరువలో ప్రవహిస్తోంది. నీటిమట్టం 11 పాయింట్ 7,5 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. అయితే గత కొద్ది గంటలుగా గోదావరి వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతుండటంతో నీటిమట్టం మరింత పెరిగి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిని చేరుకునే అవకాశాలు తక్కువగా ఉన్నాయని ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు. వరద పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గోదావరి నుంచి వస్తున్న భారీ నీటి ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని ధవళేశ్వరం బ్యారేజ్‌కు సంబంధించిన 175 గేట్లను ఎత్తివేశారు. ప్రస్తుతం బ్యారేజ్ నుంచి 9 లక్షల 62 వేల క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి బిగ్ రిలీఫ్



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డికి బిగ్ రిలీఫ్ లభించింది. గతంలో ఈడీ అటాచ్ చేసిన రూ.50 లక్షల ఉత్తర్వులను PMLA అప్పిలేట్ ట్రిబ్యునల్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కేసులో ఏసీబీ ఇప్పటికే రూ.50 లక్షల్ని స్వాధీనం చేసుకుని ట్రయల్ కోర్టులో భద్రపరిచిందని, అంతే మొత్తాన్ని ఈడీ అటాచ్ చేయాల్సిన అవసరం లేదని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. 2015వ సంవత్సరంలో ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డిపై ఓటుకు నోటు కేసు నమోదయింది.

**కేసు నేపథ్యం**

2015లో తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ ఓటును కొనుగోలు చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలతో ఏసీబీ కేసు నమోదు చేసింది. ఆ సమయంలో రూ. 50 లక్షల నగదును ఏసీబీ స్వాధీనం చేసుకుని రేవంత్ రెడ్డి సహా ఇతర నిందితులను అరెస్టు చేసింది. ఆ తర్వాత ఈ వ్యవహారం ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ కేసు నమోదు చేసి, ఆస్తులను అటాచ్ చేయగా, తాజాగా అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆ నిర్ణయాన్ని రద్దు చేస్తూ రేవంత్ రెడ్డికి ఊరట నిచ్చింది.

# లోకల్ రిజర్వేషన్పై సుప్రీం క్లారిటీ



**న్యూఢిల్లీ :** తెలంగాణలో లోకల్ రిజర్వేషన్‌కు సంబంధించి సుప్రీంకోర్టు మ-రోసారి స్పష్టతనిచ్చింది. తెలంగాణ లోకల్ రిజర్వేషన్‌కు నాలుగేళ్ల రూల్ తప్పనిసరి అని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారమే స్థానిక రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే అని పేర్కొంది. గతంలో జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈరోజు సుప్రీంకోర్టు పునరుద్ధాటించింది. తెలంగాణ లోకల్ రిజర్వేషన్‌కు నాలుగేళ్ల విద్యాభ్యాసం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అంకిత వేసిన పిటిషన్‌ను ధర్మాసనం డిస్మిస్ చేసింది.ఈ నిబంధన ఏకపక్షంగా ఉందన్న వాదనను జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం కొట్టివేసింది. ఎంబీబీఎస్ అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులకే స్థానిక రిజర్వేషన్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రభుత్వం గతంలో విడుదల చేసిన జీవోను సుప్రీం ధర్మాసనం మరోమారు సమర్థించింది.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# దిమ్మతిరిగే ఫలితం వస్తుంది



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఖైరతాబాద్ నియోజకవర్గంలో జరగబోయే ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ వైపు నుంచి అద్భుతమైన ఫలితం వస్తుందని, ప్రత్యర్థులకు దిమ్మతిరిగే షాక్ తగులుతుందని ఎమ్మెల్యే దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. ఇవాళ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నెక్లెస్ రోడ్‌లో చేపట్టిన కాంగ్రెస్ నిరసన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎలాంటి సర్ , ఇతర రాజకీయ ప్రభావం చూపలేవని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ఎన్నికల సంఘం తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఖైరతాబాద్‌లో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తున్నాయని, రాబోయే ఉపఎన్నికలో ఊహించని రీతిలో ఘనవిజయం సాధించి తీరుతామని పేర్కొన్నారు.

**బీజేపీపై 'ఓటు చోరీ' ఆరోపణలు..**

ఎన్నికల సంఘాన్ని అడ్డంపెట్టుకొని బీజేపీ పెద్దఎత్తున ఓటు చోరీకి పాల్పడుతోందని దానం నాగేందర్ విమర్శించారు. గతంలో జరిగిన ఎంపీ ఎన్నికల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేవలం ఓటు చోరీ ద్వారానే గెలిచారంటూ సంచలన ఆరోపణలు చేశారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్‌కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, ఎన్నికల ప్రక్రియను నీరుగారుస్తున్న ఈ సీఈసీ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు స్వయంగా సుమోటోగా స్వీకరించి తగిన చర్యలు తీసుకోవాలని దానం నాగేందర్ విజ్ఞప్తి చేశారు.

# కదంతొక్కిన కాంగ్రెస్ శ్రేణులు




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్‌కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కదం తొక్కాయి. ఏఐసీసీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా నగరంలో ఉద్రిక్త వాతావరణం మధ్య భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.

**నెక్లెస్ రోడ్డు నుంచి ఈసీ కార్యాలయం వరకు..**

నగరంలోని ప్రసిద్ధ నెక్లెస్ రోడ్డు లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో నిరసన ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ర్యాలీగా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పలువురు ప్రముఖ ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

**కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు..**

ఈ సందర్భంగా నిరసనకారులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని స్వతంత్ర రాజ్యాంగ సంస్థలను పూర్తిగా నీరుగారుస్తోందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్‌ను తమ రాజకీయ ప్రయోజనాల కోసం కీలుబొమ్మలా మార్చుకుని, ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భారీ కుట్ర జరుగుతోందని, ప్రజల ఓటు హక్కును కాలరాసేలా 'ఓట్ల చోరీ'కి కేంద్ర ప్రభుత్వ పెద్దలే సూత్రధారులని దుయ్యబట్టారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో నడుస్తూ నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో విఫలమయ్యారని, ఆయన పదవిలో కొనసాగే అర్హత కోల్పోయారని మండిపడ్డారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వరకు తమ పోరాటం ఆగదని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు.

# ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తే కాంగ్రెస్‌కే అధికారం

**వనపర్తి ,ఫ్లాష్ ఇండియా :** రాజ్యాంగ బద్దంగా, పారదర్శకంగా, దేశ పౌరుల ఓటు తొలగింపు లేకుండా న్యాయంగా ఇప్పుటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావడం ఖాయమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాఅధ్యక్షులు శివసేన రెడ్డి అధ్యక్షాతన బీజేపి ఓటు చోరి విధానాన్ని ఎండగడుతూ చేపట్టిన నిరసన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపి మూడు సార్లు అధికారంలోకి వచ్చింది ప్రజల మద్దతుతో కాదు, ఓట్లు దొంగలించి మాత్రమే.. నానీ బట్టబయలైందన్నారు. కేంద్ర ఎలక్షన్ కమీషన్ ని బీజేపి పార్టీకి అనుకూలంగా వాడుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, రెండు సార్లు అధికారంలోకి వచ్చారని సీఈవో జ్ఞానేష్‌కుమార్ చర్యల ద్వారా దేశప్రజలందరికి స్పష్టంగా తెలిసిపోయిందన్నారు. సర్ ప్రక్రియలో కుట్ర ఉందని మొదటి నుండికాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీ చెబుతున్నారని గుర్తుచేశారు.

**ఇప్పటికైనా ప్రజాస్వామ్యం మీద ఏమాత్రం..**

బీజేపి దుర్మార్గపు ఆలోచనను దేశ ప్రజలకు చెప్పడానికి ప్రయత్నించిన నిజం ఇప్పుడు అందరికీ తెలిసిందని వివరించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కక్ష్యపూరితంగా ఓట్ల తొలగింపుకు ప్రేరేపిస్తుందన్నారు. దానికి ఉదహరణ ప్రతిపక్షాలు బలంగా ఉన్న ప్రాంతాలలో డిజిటల్ ఫారమ్‌లు, నకిలీ లాగిన్‌ల ద్వారా లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించారని మంత్రి ఆరోపించారు. భారీ "ఓటు చోరీ" కుట్ర వెనుక ఉన్నవారిని కాపాడుతూ, అధికార బీజేపీ ప్రయోజనాల కోసం జ్ఞానేశ్ కుమార్ పనిచేస్తున్నారని విమర్శించారు. దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లవెత్తుతున్న నేపథ్యంలో ఇప్పటికైనా ప్రజాస్వామ్యం మీద ఏమాత్రం గౌరవమున్న, బీజేపీ కేంద్ర ప్రభుత్వం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను,బాధ్యులైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని మంత్రి పొంగులేటి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, ఖర్గే, అగ్రనాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ , ప్రియాంగా గాంధీ పార్లమెంటులో చెప్పిన విధంగా దేశ ప్రజల మీద విశ్వాసం ఉన్నాకేంద్రంలో ఉన్న బీజేపీ పార్టీ దీనికి బాధ్యతగా వ్యవహరించి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి రాజ్యంగ విలులను కాపాడాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్లకార్డులు, బ్యానర్లతో ఎన్నికల సంఘ ప్రధాన అధికారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ఎలక్షన్ కమిషన్ బీజేపీకి తొత్తు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కేంద్రంలోని నరేంద్ర మోడీ, అమిత్ షాల వైఖరితో దేశంలో ప్రజాస్వామ్యం తీవ్ర ముప్పులో పడిందని, ప్రపంచ దేశాలన్నీ భారత్ తీరు చూసి ముక్కున వేలేసుకుంటున్నాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ సూచనలతో ఎలక్షన్ కమిషన్ (ఈసీ) బీజేపీకి తొత్తుగా మారి, నిష్పాక్షికతను వదిలేసి ప్రవర్తిస్తోందని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ తీరుతో ఓటర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఎన్నికల నిర్వహణ పూర్తిగా మ్యానిపులేట్ అయ్యేలా జరుగుతోందని విమర్శించారు. ఎలక్షన్ కమిషనర్ల తీరుపై స్వయంగా అధికారులే తీవ్ర అసంతృప్తితో లబోదిబో మంటున్నారంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు.

**ఓట్ల చోరీతో ప్రజాస్వామ్యానికి విఘాతం..**

బిహార్లో ఆర్జేడీ , పశ్చిమ బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ ఓటమి వెనుక ఎలక్షన్ కమిషన్ మోసపూరిత వైఖరి ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత మీనాక్షి నటరాజన్ గెలవాల్సిన సీటును సైతం కుట్రపూరితంగా చోరీ చేశారని ధ్వజమెత్తారు. ఓట్ల అక్రమాల ద్వారా దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. ఎలక్షన్ కమిషన్ అక్రమాలకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీల నేతృత్వంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

**హాజరైన ముఖ్య నేతలు..**

ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ అజారుద్దీన్, ఎంపీలు వివేక్ వెంకటస్వామి, అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, అంజన్ కుమార్ యాదవ్, సర్వే సత్యనారాయణలతో పాటు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీ గణేష్, నవీన్ యాదవ్, డీసీసీ అధ్యక్షులు మోతె రోహిత్, దీపక్ జాన్, ఖలీద్, మైనారిటీ కమిషన్ చైర్మన్ ఫేహీం ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ కాంగ్రెస్ నిరసన : డిప్యూటీ సీఎం భట్టి**

బీఆర్కే భవన్ వద్ద రాజ్యాంగ ప్రతితో నిరసనలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎన్నికల అధికారులకు కాంగ్రెస్ నేతలతో కలిసి వినతిపత్రం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న ఏఐసీసీ పిలుపులో భాగంగా టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. బీఆర్కే భవన్ వద్ద జరిగిన నిరసనలో రాజ్యాంగ ప్రతిని చేతబట్టి ఇతర కాంగ్రెస్ నాయకులతో కలిసి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగేలా రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగాలన్న డిమాండ్‌ను కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా వినిపించారు. నిరసన అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్ తదితరులతో కలిసి ఎన్నికల అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం ఉండాలని, రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.



# అందుకే తెలుగుదేశం పార్టీలో చేరా

**ఢిల్లీ :** ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓ ప్రతిష్టాత్మక కాంక్లేవ్‌లో పాల్గొని మాట్లాడారు. 'ఇండియాస్ నెక్ట్స చాప్టర్' అనే అంశంపై ప్రసంగించిన ఆయన.. దేశ రాజకీయాలు, తెలంగాణ రాజకీయ పరిస్థితులు, తన రాజకీయ ప్రయాణం, అలాగే ఓటర్ల జాబితా సవరణలపై సంచలన వ్యాఖ్యలు చేశారు.

**తెలంగాణ రాజకీయాలు - నాటి పరిణామాలు..**

ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశాల మధ్య రాజకీయ శైలిలో స్పష్టమైన వ్యత్యాసం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో విద్యార్థి సంఘాల ప్రభావం తక్కువగా ఉంటుందని.. ఇక్కడ లెఫ్ట్, రైట్ సంఘాలు మాత్రమే కనిపిస్తాయని తెలిపారు. విద్యార్థి రాజకీయాల్లో ఏబీవీపీ ప్రభావం ఉన్నప్పటికీ, ప్రధాన రాజకీయాల్లో మాత్రం కాంగ్రెస్ ప్రభావమే బలంగా ఉందన్నారు. వర్సిటీల్లో వేరే విద్యార్థి సంఘాల్లో కొనసాగినప్పటికీ, గ్రామ స్థాయికి వచ్చేసరికి ప్రజలు కాంగ్రెస్‌లోనే ఉంటారని స్పష్టం చేశారు. అలాగే తెలంగాణలో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదని వ్యాఖ్యానించారు.

**టీడీపీలో చేరిక.. కాంగ్రెస్‌లోకి ప్రయాణం..**

తన రాజకీయ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ.. "2006లో జెడ్పీటీసీగా, 2007లో ఎమ్మెల్సీగా స్వతంత్రంగా గెలిచాను. ఆ రెండు సార్లూ కాంగ్రెస్ అభ్యర్థులనే ఓడించాను. అప్పట్లో కాంగ్రెస్, టీడీపీలు మాత్రమే ప్రధాన పార్టీలుగా ఉండేవి. నాడు జిల్లా కాంగ్రెస్ నేతలతో సంబంధాలు లేకపోవడం, ప్రభుత్వంతో పోరాడాలంటే ప్రతిపక్షమే సరైన వేదిక అని భావించి టీడీపీలో చేరాను. టీడీపీ తరఫున 2009, 2014ల్లో ఎమ్మెల్యేగా గెలిచాను. అయితే పార్టీ సీనియర్ నాయకత్వం అంతా ఏపీకే పరిమితం కావడంతో తెలంగాణలో టీడీపీ ప్రభావం తగ్గింది. ఆ తర్వాత 2017లో కాంగ్రెస్‌లో చేరి, 2019లో ఎంపీగా విజయం సాధించాను" అని వివరించారు.

**ఓట్ల తొలగింపుపై తీవ్ర ఆగ్రహం..**

పేదల ఓటు హక్కును కాలరాసేందుకే 'సర్'ను తెరపైకి తెచ్చారని సీఎం తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓట్లను తొలగించారని ఆరోపించారు. దేశంలో జనాభా తగ్గనప్పుడు, ఓట్ల సంఖ్య మాత్రమే ఎలా తగ్గుతుందో కేంద్రం సమాధానం చెప్పాలని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

# ఉప ఎన్నిక.. గెజిట్ విడుదల.!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నికకు రంగం సిద్ధమవుతోంది. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ అనర్హత వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఇప్పటికే సుప్రీంకోర్టు సమర్థించింది. అనర్హత వేటును సవాల్ చేస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు స్పష్టమైంది. దానం నాగేందర్ 2024 ఏప్రిల్ 23న సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన తేదీ నుంచే ఆయన అనర్హత అమల్లోకి వస్తుందని హైకోర్టు తీర్పు ఇచ్చింది. అదే తేదీ నుంచి ఖైరతాబాద్ సీటు ఖాళీగా ఉన్నట్లు కోర్టు పేర్కొంది. సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించడంతో.. ఖైరతాబాద్ ఉప ఎన్నికకు మార్గం సుగమమైంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీ అయినట్లు అధికారికంగా గెజిట్ విడుదల చేసింది. 2024 ఏప్రిల్ 23 నుంచి ఈ స్థానం ఖాళీగా ఉన్నట్లు గెజిట్‌లో పేర్కొన్నట్లు సమాచారం. ఇక ఖాళీ స్థానంపై ఎన్నికల సంఘం తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఉప ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించాల్సి ఉంది. దీంతో హైదరాబాద్‌లో మరోసారి అసెంబ్లీ ఉప ఎన్నిక రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకోనుంది.

# గ్రేటర్ మున్సిపోల్స్‌తోపాటు స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాబోయే స్థానిక సంస్థలు, జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లో సత్తా చాటాలని.. అందుకు తగిన విధంగా సిద్ధం కావాలని పార్టీ కేడర్‌కు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. రానున్న కాలంలో పార్టీ నేతలు, క్యాడర్ నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేస్తున్నారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి మెదక్ జిల్లాల నేతలతో భేటీ అయ్యారు. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, గ్రేటర్ వరంగల్, ఖమ్మం కార్పొరేషన్‌లు, సిద్దిపేట సహా ఇతర మున్సిపాలిటీల్లో పోటీ చేసి సత్తా చాటాలని నేతలకు సూచించారు. నిజామాబాద్, కొడంగల్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలకు సంబంధించి ప్రజల నుంచి ఎలాంటి ఫీడ్ బ్యాక్ వచ్చిందో అడిగి తెలుసుకున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా టీఆర్ఎస్ ఎలాంటి పాత్ర పోషించాలని ప్రజలు కోరుకుంటున్నారు, ఇంకా ఎలాంటి కార్యక్రమాలు ఉంటే బాగుంటుందని భావిస్తున్నారో ఆ దిశలోనే పయనిద్దామని సూచించారు. టీఆర్ఎస్ చేస్తున్న పోరాటాలతోనే ప్రభుత్వంలో కదలిక వస్తుందని కవిత చెప్పారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్ని ప్రమాదం జరిగి ఐదుగురు చిన్నారులు మృతి చెందిన ఘటనలో తెలంగాణ రక్షణ సేన స్పందించిన తీరుతోనే ప్రభుత్వం దిగివచ్చిందని గుర్తు చేశారు. ఏళ్లకేళ్లుగా రిమ్స్ హాస్పిటల్ ను పట్టించుకోని ప్రభుత్వం తక్షణ చర్యల కోసం రూ.11 కోట్లు రిలీజ్ చేసిందని చెప్పారు. రిమ్స్ హాస్పిటల్ సమస్యలపై రివ్యూ చేసి చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారన్నారు. తాను ఆస్పత్రిని విజిట్ చేసి బాధిత కుటుంబాలను పరామర్శించి అండగా నిలిచిన తర్వాతనే ప్రభుత్వం దిగివచ్చి మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించిందన్నారు. కాగా.. గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో త్వరలోనే హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు

**ప్రభుత్వం తీరుతో విద్యార్థులకు నష్టం**

ప్రభుత్వం తీరుతో తెలంగాణ మెడికల్ విద్యార్థులకు నష్టం జరుగుతున్నదని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తెచ్చిన జీవో కారణంగా తెలంగాణ బిడ్డలు రక్షణలు కోల్పోయే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. ఈ విపత్తుకు వ్యతిరేకంగా తెలంగాణ సమాజమంతా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మెడికల్ సీట్లకు సంబంధించి స్థానికత అంశంలో ప్రభుత్వ నిర్ణయం కారణంగా మన పిల్లలకు నష్టం జరుగుతున్నదని.. ఇతర రాష్ట్రాల పిల్లలకు మేలు జరుగుతుందని తెలిపారు. అలాంటి ఈ అంశాన్ని సరిదిద్దుకోవాల్సింది పోయి.. సుప్రీంకోర్టులో ఈ అంశాన్ని ప్రభుత్వం డిఫెండ్ చేస్తున్నదని పేర్కొనారు. మొదట జీవో 33 ఇచ్చారని.. దాన్ని ఎక్స్‌టెన్డ్ చేస్తూ జీవో 150 తెచ్చారని పేర్కొన్నారు. 1 వ తరగతి నుంచి 7 వ తరగతి వరకు ఇక్కడ చదువుకున్న వాళ్లను స్థానికులుగా భావించాలని.. కానీ, 8 నుంచి 12వ తరగతి వరకు చదువుకున్న వాళ్లు లోకల్ అనేలా జీవో తెచ్చారని ఆరోపించారు. దీన్ని కచ్చితంగా ప్రశ్నించాలని.. ఇప్పుడు మెడికల్ సీట్ల వరకే ఉన్న ఈ జీవోను అన్ని రంగాల్లోకి తెస్తారని చెప్పారు.

# స్కూళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్దేశించిన గడువులోగా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచి, ప్రతి దశలో పురోగతి కనిపించేలా కార్యాచరణ చేపట్టాలని స్పష్టం చేశారు. సోమవారం ప్రజాభవన్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణ పురోగతిపై ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. "ఇది కేవలం భవనాల నిర్మాణం కాదు.. తెలంగాణ బిడ్డల భవిష్యత్తు నిర్మాణం. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఈ ప్రాజెక్టును పూర్తి చేయడంలో అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలి. అవసరమైతే రాత్రింబవళ్లు శ్రమించి పనుల్లో వేగం పెంచాలి" అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఒకే ప్రాంగణంలో.. అందరికీ అత్యుత్తమ విద్య పేద విద్యార్థులకు కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా ఒకే ప్రాంగణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్య, అత్యుత్తమ సౌకర్యాలు అందించాలన్నదే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఒకేచోట కలిసి చదువుకోవడం ద్వారా సామాజిక సమానత్వం, సమీకృత భావన పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రతి స్కూల్‌కు వర్క్ క్యాలెండర్ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో చేపట్టిన స్కూల్ నిర్మాణాలకు సంబంధించి జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ప్రత్యేక వర్క్ క్యాలెండర్ సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వారానికోసారి పనుల పురోగతిని సమీక్షించి, తనకు క్రమం తప్పకుండా నివేదిక అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనుల తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రతి నిర్మాణ ప్రాంతంలో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వచ్చే నెల రెండో వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కూళ్లను స్వయంగా ఆకస్మికంగా తనిఖీ చేస్తానని డిప్యూటీ సీఎం తెలిపారు. 87 నియోజకవర్గాల్లో స్కూళ్లకు అనుమతులు సమీక్షలో ఈఎంసీ గణపతి రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ పనుల పురోగతిని వివరించారు. ఇప్పటివరకు 87 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు కాగా, 70 స్కూళ్లలో నిర్మాణ పనులు ప్రారంభమై వేగంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. మరో 5 స్కూళ్లకు డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నామని, 3 స్కూళ్లకు టెండర్ల ప్రక్రియ ముగింపు దశలో ఉందని, మరో 4 స్కూళ్లకు స్థలానికి సంబంధించిన సమస్యలు ఉన్నాయని అధికారులు వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన కాలపరిమితికి అనుగుణంగా నిర్మాణాలను పూర్తి చేసి, స్కూల్ భవనాలను త్వరగా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడతామని అధికారులు డిప్యూటీ సీఎంకు తెలిపారు.

# సంపాదకీయం

## వెలుతురు దోసిలి... (కవిత)

తెల్లారినా దేహ ఆకాశంలో
మినుకుమినుకు మంటూ ఆలోచనలు మెరుస్తాయి...
ఈ తారలకు అంతేలేదు పగలు రాత్రి తేడా లేదు..
ఏమరపాటులో మనసు గాలానికి
కాలం చిక్కి పోతుంది..
నిఘా కరువైతే దాడి తప్పదు..
నవ్వులు అబద్ధం..
సుఖం ఓ ఎండమావి...
భావో ద్వేగాల మనసు..
చేసిందేమీ లేదు..
వెలుగు నీడల వెంట మనిషి పరుగు..
దోసిలి పట్టి వెలుతురు ను తాగేస్తేనే జీవితం నిజం..!!



తంగెళ్లపల్లి కనకా చారి
హైదరాబాద్
8790874038

## ఖర్చుల భారం పార్టీలకు సవాలా?




తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియకు రంగం సిద్ధమవుతున్న వేళ.. ప్రధాన రాజకీయ పార్టీలలో కొత్త ఆందోళన మొదలైంది. సాధారణంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సిద్ధాంతపరమైన చర్చలు, విద్యావంతుల సమస్యలు, నిరుద్యోగం, ఉద్యోగ అవకాశాలు, విద్యా రంగం వంటి అంశాల చుట్టూ సాగాల్సి ఉంటుంది. కానీ ఇటీవలి ఎన్నికల అనుభవాలను పరిశీలిస్తే.. ఈ ఎన్నికలు కూడా భారీ ఖర్చుతో కూడుకున్న పోటీగా మారుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. పెరుగుతున్న ఎన్నికల వ్యయం పార్టీలకు మాత్రమే కాకుండా, పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు కూడా ఆర్థిక భారంగా మారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం ఎన్నికలు జరగనున్న రెండు పట్టభద్రుల నియోజకవర్గాల పరిధి చాలా విస్తృతంగా ఉంది. హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ నియోజకవర్గం పరిధిలో 43 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. వరంగల్--ఖమ్మం--నల్లగొండ నియోజకవర్గం పరిధిలో 34 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అంటే రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 77 నియోజకవర్గాల పరిధిలో ఈ రెండు ఎమ్మెల్సీ ఎన్నికల రాజకీయ ప్రభావం కనిపించనుంది. 2021 నాటి వివరాల ప్రకారం ఈ రెండు నియోజకవర్గాల్లో కలిపి 10 లక్షలకు పైగా పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. ప్రస్తుత ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయ్యే నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.ఇంత విస్తృతమైన భౌగోళిక పరిధిలో అభ్యర్థిని ప్రజల్లోకి తీసుకెళ్లడం, నియోజకవర్గాల వారీగా ప్రచార వ్యవస్థను ఏర్పాటు చేయడం, పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం అంత తేలికైన విషయం కాదు. సమావేశాలు, ప్రచార కార్యక్రమాలు, కార్యకర్తల రవాణా, ప్రచార సామగ్రి, సోషల్ మీడియా ప్రచారం వంటి అంశాలకు ఖర్చు అవుతుందని పార్టీలు అంచనా వేస్తున్నాయి. అయితే రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న వందల కోట్ల రూపాయల ఖర్చు అంచనాలను అధికారిక ఎన్నికల వ్యయ గణాంకాలుగా పరిగణించకూడదు. అవి ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ చర్చలు, అంచనాలుగానే చూడాల్సి ఉంటుంది.ఈ ఖర్చుల అంశం అభ్యర్థుల ఎంపికపైనా ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. ఆర్థికంగా బలమైన నేపథ్యం ఉన్న కొందరు ప్రముఖులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి వెనుకంజ వేస్తున్నారనే చర్చ ఉంది. పార్టీ టికెట్ లభించినా.. ఎన్నికల ఖర్చును భరించడం, రెండు నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించడం, నెలల తరబడి పార్టీ యంత్రాంగాన్ని నడపడం వంటి అంశాలు వారికి భారంగా మారవచ్చనే భావన ఉంది. దీంతో కొందరు నాయకులు ఎమ్మెల్సీ కంటే భవిష్యత్తులో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికే ఆసక్తి చూపుతున్నారన్న చర్చ కూడా వినిపిస్తోంది.మరోవైపు పార్టీలకు ఇది అభ్యర్థి ఎంపికతో ముగిసే సమస్య కాదు. మూడు జిల్లాలు, డజన్ల కొద్దీ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నాయకులను ఒకే దిశలో పనిచేయించడం పెద్ద సవాలుగా మారుతుంది. స్థానిక నాయకుల మధ్య సమన్వయం లేకపోతే అభ్యర్థి బలమైన వ్యక్తి అయినప్పటికీ ఎన్నికల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. అందుకే ప్రధాన పార్టీలు ముందుగానే నియోజకవర్గాల వారీగా బాధ్యతలు, ఓటరు నమోదు, ప్రచార వ్యూహాలపై దృష్టి పెట్టే అవకాశం ఉంది.ఈ రెండు ఎమ్మెల్సీ ఎన్నికలను రాజకీయ పార్టీలు ఎందుకు ప్రతిష్ఠాత్మకంగా చూస్తున్నాయన్నదీ ముఖ్యమైన ప్రశ్న. ఎమ్మెల్సీ ఫలితం నేరుగా రాష్ట్ర ప్రభుత్వ మనుగడను నిర్ణయించదు. అయినప్పటికీ ఒక పార్టీకి అనుకూలంగా లేదా ప్రతికూలంగా వచ్చే ఫలితం రాష్ట్ర రాజకీయ వాతావరణంపై ప్రభావం చూపవచ్చు. అధికార పార్టీకి అనుకూల ఫలితం వస్తే ప్రభుత్వ విధానాలకు పట్టభద్రుల మద్దతు ఉందనే రాజకీయ సందేశాన్ని ప్రచారం చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రతిపక్షాలకు అనుకూల ఫలితం వస్తే ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందనే రాజకీయ వాదనను ముందుకు తెచ్చే అవకాశం ఉంటుంది. అయితే ఇవి రాజకీయ పార్టీల ప్రచార వ్యాఖ్యానాల పరిధిలోనే చూడాలి.ముఖ్యంగా పట్టభద్రుల ఓటర్లను కేవలం ఆర్థిక ప్రలోభాలతో ప్రభావితం చేయగలమనే అంచనా కూడా సరైనది కాకపోవచ్చు. విద్యావంతుల ఓటర్లు ఉద్యోగాలు, నిరుద్యోగం, విద్యా వ్యవస్థ, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, పరిశ్రమలు, యువతకు అవకాశాలు, ప్రభుత్వ పాలన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. అభ్యర్థి వ్యక్తిగత ప్రతిష్ఠ, గత ప్రజా సేవ, సమస్యలపై అవగాహన కూడా నిర్ణయాత్మకంగా మారవచ్చు.అందువల్ల రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు కేవలం డబ్బు, ప్రచార బలం ఆధారంగా జరిగే పోటీగా చూడటం కంటే.. రాజకీయ పార్టీల సంస్థాగత సామర్థ్యానికి, అభ్యర్థుల విశ్వసనీయతకు, పట్టభద్రుల సమస్యలపై వారి అవగాహనకు పరీక్షగా చూడాల్సి ఉంటుంది. ఎన్నికలకు ముందున్న నెలల్లో ఓటరు నమోదు ఎంత పెరుగుతుంది, ప్రధాన పార్టీలు ఎలాంటి అభ్యర్థులను ఎంపిక చేస్తాయి, వామపక్షాలు మరియు ఇతర రాజకీయ శక్తులు ఏ విధంగా వ్యవహరిస్తాయి, ప్రచారం ఏ అంశాల చుట్టూ తిరుగుతుంది అన్నది కీలకం.చివరికి ఈ ఎన్నికల అసలు పరీక్ష ఒక్కటే–పెరుగుతున్న ఖర్చుల మధ్య పట్టభద్రుల అసలు సమస్యలను రాజకీయ అజెండాగా ఎవరు ముందుకు తీసుకువస్తారు? డబ్బు, ప్రచార యంత్రాంగం ఒక వైపు ఉంటే.. ఓటర్ల సమస్యలు, అభ్యర్థుల విశ్వసనీయత మరోవైపు ఉంటాయి. ఈ రెండింటి మధ్య జరిగే పోటీనే తెలంగాణ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు రాజకీయ ప్రాధాన్యతను తీసుకురానుంది.

## కాంగ్రెస్‌తో జట్టా.. లేక ఒంటరి పోరా?

తెలంగాణలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియకు కసరత్తు ప్రారంభం కావడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి ఎన్నికల వేడి మొదలైంది. 2027 మార్చిలో ఖాళీ కానున్న మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్, వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల సంఘం ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించింది. సెప్టెంబర్ 28 నుంచి నవంబర్ 6 వరకు ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణ కొనసాగనుంది. ఎన్నికలకు ఇంకా కొంత సమయం ఉన్నప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తమ తమ రాజకీయ లెక్కలను పరిశీలిస్తుండగా, కొత్త రాజకీయ సమీకరణాలకు వామపక్షాల వైఖరి కూడా ప్రాధాన్యత సంతరించుకుంటోంది.ప్రత్యేకంగా సీపీఐ, సీపీఎం అనుసరించబోయే వ్యూహం ఈ ఎన్నికల్లో ఆసక్తికర అంశంగా మారుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సాధారణ అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే భిన్నమైన రాజకీయ స్వభావం ఉంటుంది. ఉద్యోగులు, విద్యావంతులు, నిరుద్యోగులు, యువత, మేధావులు, వివిధ వృత్తి వర్గాలకు చెందిన పట్టభద్రులు ఓటర్లుగా ఉండటం వల్ల అభ్యర్థి వ్యక్తిగత ప్రతిష్ఠ, ప్రజా సమస్యలపై అవగాహన, ఉద్యోగ–విద్య–నిరుద్యోగ అంశాలపై వైఖరి వంటి అంశాలు ప్రభావం చూపుతాయి. ఈ నేపథ్యంలో సంప్రదాయ రాజకీయ పార్టీలతో పాటు సిద్ధాంతపరమైన రాజకీయ నేపథ్యం ఉన్న వామపక్షాలకు కూడా ప్రత్యేక స్థానం ఉంటుంది.గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వామపక్షాలు తమ ఉనికిని చాటుకున్న సందర్భాలు ఉన్నాయి. హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ సీపీఎం మద్దతుతో విజయం సాధించిన విషయం రాజకీయంగా ప్రస్తావనకు వస్తూనే ఉంటుంది. అదే విధంగా వరంగల్--ఖమ్మం--నల్లగొండ నియోజకవర్గంలోనూ వామపక్షాలకు ఒక స్థిరమైన రాజకీయ ప్రభావం ఉన్నదనే అభిప్రాయం ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి దశలో ఈ నియోజకవర్గంలో సీపీఐ, సీపీఎం కలిసి పోటీ చేసిన సందర్భాలు ఉండగా, తరువాతి ఎన్నికల్లో ఒక పార్టీ అభ్యర్థికి మరో పార్టీ మద్దతు ఇచ్చిన సందర్భాలు కూడా కనిపించాయి.అందువల్ల ఈసారి వామపక్షాల ముందు ప్రధానంగా మూడు మార్గాలు కనిపిస్తున్నాయి. మొదటిది.. సీపీఐ, సీపీఎంలు కలిసి ఉమ్మడి అభ్యర్థిని బరిలోకి దించడం. రెండోది.. కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వడం. మూడోది.. రెండు పార్టీలు తమ తమ అభ్యర్థులను పోటీకి నిలబెట్టడం. ఈ మూడు మార్గాల్లో ఏది ఎంచుకోవాలన్నది కేవలం ఎన్నికల గణితంతోనే కాకుండా రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులతోనూ ముడిపడి ఉంటుంది.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటం ఈ సమీకరణాలను మరింత ఆసక్తికరంగా మారుస్తోంది. సీపీఐ కాంగ్రెస్ ప్రభుత్వానికి భాగస్వామిగా ఉంది. మరోవైపు జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో భాగస్వామ్యంగా ఉన్న సీపీఎం కూడా వివిధ రాజకీయ అంశాల్లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్న సందర్భాలు ఉన్నాయి. దీంతో కాంగ్రెస్ సహజంగానే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వామపక్షాల మద్దతును కోరే అవకాశం ఉంది. అయితే వామపక్షాల రాజకీయ చరిత్రను పరిశీలిస్తే, కేవలం పొత్తుల లెక్కలకే పరిమితం కాకుండా తమ స్వతంత్ర రాజకీయ గుర్తింపును నిలబెట్టుకోవడం కూడా వాటికి ముఖ్యమైన అంశం.ఇక్కడే వామపక్షాలకు వ్యూహాత్మక ప్రశ్న ఎదురవుతోంది. కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తే అధికార పార్టీతో రాజకీయ సమన్వయం మరింత బలపడే అవకాశం ఉంటుంది. అదే సమయంలో తమ సొంత అభ్యర్థిని బరిలోకి దింపితే వామపక్షాల రాజకీయ బలం ఎంత మేర ఉందో మరోసారి పరీక్షించుకునే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పట్టభద్రుల ఓటర్లలో తమకు ఉన్న సంప్రదాయ మద్దతును నిలబెట్టుకోవాలంటే స్వతంత్రంగా పోటీ చేయాలనే ఆలోచన కూడా పార్టీలలో ఉండవచ్చు.అయితే సీపీఐ, సీపీఎంలు వేర్వేరుగా పోటీ చేస్తే ఓట్ల విభజన జరిగే అవకాశం ఉందనే రాజకీయ చర్చ కూడా ఉంది. అలాంటి పరిస్థితిలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య కేంద్రీకృతమయ్యే అవకాశాలు ఉండటంతో వామపక్షాల ఓట్లు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అంశంగా మారవచ్చు. మరోవైపు రెండు వామపక్ష పార్టీలు ఒకే అభ్యర్థిని నిలబెడితే ఓట్ల సమీకరణకు అవకాశం ఏర్పడుతుంది. అయితే ఆ అభ్యర్థి ఎంపిక, ప్రచార వ్యూహం, పట్టభద్రుల సమస్యలపై స్పష్టమైన కార్యాచరణ వంటి అంశాలు కూడా కీలకంగా మారతాయి.ఇదే సమయంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీతో పాటు కొత్త రాజకీయ శక్తుల ప్రవేశం కూడా ఎన్నికల సమీకరణాలను మార్చే అవకాశం ఉంది. కల్వకుంట్ల కవిత సారథ్యంలోని తెలంగాణ రక్షణ సేన కూడా బరిలోకి వస్తుందా అన్న అంశం స్పష్టతకు రావాల్సి ఉంది. కొత్త అభ్యర్థులు, కొత్త రాజకీయ వేదికలు రంగంలోకి వస్తే సంప్రదాయ పార్టీల ఓటు లెక్కలు మారే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పట్టభద్రుల నియోజకవర్గాల్లో అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, ప్రచార సామర్థ్యం, యువత సమస్యలపై వారి వైఖరి ప్రభావం చూపే అవకాశం ఉంది.ఈ నేపథ్యంలో వామపక్షాల నిర్ణయం కేవలం ఒక ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన అంశంగా చూడలేం. తెలంగాణ రాజకీయాల్లో తమ భవిష్యత్ పాత్రను ఎలా నిర్వచించుకోవాలన్న దానికీ ఇది ఒక పరీక్షగా మారవచ్చు. అధికార పక్షంతో సమన్వయమా? స్వతంత్ర రాజకీయ పోరాటమా? లేక ఉమ్మడి వామపక్ష అభ్యర్థితో తమ బలాన్ని చాటుకోవడమా? అనే ప్రశ్నలకు సీపీఐ, సీపీఎంల రాష్ట్ర కమిటీలు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.చివరికి ఎన్నికల ఫలితాన్ని నిర్ణయించేది కేవలం పార్టీ బలాబలాలు మాత్రమే కాదు. ఓటరు నమోదు ఎంత విస్తృతంగా జరుగుతుంది, పట్టభద్రుల ఓటర్లు ఏ అంశాలకు ప్రాధాన్యత ఇస్తారు, అభ్యర్థుల ఎంపిక ఎలా ఉంటుంది, ప్రధాన పార్టీల మధ్య ఓట్ల విభజన ఎలా జరుగుతుంది వంటి అనేక అంశాలు కలిసి ఫలితాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల ప్రస్తుతం వామపక్షాల వ్యూహంపై జరుగుతున్న చర్చను తుది రాజకీయ నిర్ణయంగా కాకుండా, ఎన్నికలకు ముందు జరుగుతున్న సమీకరణాల భాగంగా చూడాల్సి ఉంటుంది.ఏదేమైనా, తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మరోసారి రాజకీయ పార్టీలకు తమ సామాజిక, సిద్ధాంతపరమైన బలాన్ని పరీక్షించుకునే వేదికగా మారుతున్నాయి. ఈ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎంలు తీసుకునే నిర్ణయం వారి రాజకీయ ప్రాధాన్యతలను మాత్రమే కాకుండా, కాంగ్రెస్‌తో వారి సంబంధాల దిశను కూడా ప్రభావితం చేసే అంశంగా నిలవవచ్చు. రెండు వామపక్ష పార్టీలు కలిసి ముందుకు సాగుతాయా, కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తాయా, లేక స్వతంత్రంగా పోటీ చేస్తాయా అన్నది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది. అప్పటి వరకు ఈ ఎన్నికల్లో వామపక్షాల అడుగు ఎటువైపు పడుతుందన్నది తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరమైన ప్రశ్నగానే కొనసాగనుంది.

## టీజీ సేఫ్.. దాడులకే పరిమితమా?




ప్రజలకు కల్తీలేని, నాణ్యమైన ఆహారం, ఔషధాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ విభాగాలను సమన్వయం చేస్తూ 'టీజీ సేఫ్' వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఆహార భద్రత విషయంలో రాజీ పడబోమనే సంకేతాన్ని ఇస్తూ ఫుడ్ సేఫ్టీ విభాగం తనిఖీలను ముమ్మరం చేసింది. హైదరాబాద్ ఓల్డ్ సిటీ నుంచి హైటెక్ సిటీ, గచ్చిబౌలి వరకు హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ గోదాములు, ఇతర ఆహార సంస్థలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం ద్వారా అధికారులు తమ దూకుడును ప్రదర్శిస్తున్నారు. అయితే ఈ దాడుల ఫలితం ఎంతవరకు ప్రజలకు శాశ్వత భద్రతను కల్పిస్తోంది? అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.తనిఖీలు నిర్వహించడం, లోపాలను గుర్తించడం, నోటీసులు ఇవ్వడం, జరిమానాలు విధించడం, అవసరమైతే లైసెన్సులు రద్దు చేయడం వరకు వ్యవస్థ పనిచేస్తున్నా.. ఆ తర్వాత పరిస్థితి ఏమిటన్నది మరింత కీలకం. ఒక రెస్టారెంట్‌లో ఆహార భద్రతా ప్రమాణాలు ఉల్లంఘించినట్లు అధికారులు గుర్తించి లైసెన్స్ రద్దు చేస్తే, అదే సంస్థ తిరిగి కార్యకలాపాలు ప్రారంభిస్తే.. ఆ చర్యకు అర్థమేంటి? ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న వ్యవహారంలో 'తనిఖీ చేశాం' అని చెప్పుకోవడం కంటే, ఉల్లంఘనలను శాశ్వతంగా అరికట్టడం ప్రభుత్వానికి అసలు పరీక్ష కావాలి.గచ్చిబౌలిలోని ఒక ప్రముఖ రెస్టారెంట్‌పై అధికారులు చర్యలు తీసుకున్న తర్వాత కూడా అది తిరిగి కార్యకలాపాలు నిర్వహించిందన్న ఆరోపణలు ఈ వ్యవస్థలోని అమలు లోపాలను వెలుగులోకి తెస్తున్నాయి. తనిఖీల సమయంలో వంటగదుల్లో అపరిశుభ్ర పరిస్థితులు, ఆహార పదార్థాల నాణ్యతపై తీవ్ర అభ్యంతరాలు, పురుగులు, ఎలుకల ఆనవాళ్లు వంటి అంశాలు బయటపడితే అవి సాధారణ ఉల్లంఘనలుగా పరిగణించలేం. ఇలాంటి పరిస్థితులు నిజంగా నిర్ధారణ అయితే.. అక్కడ తయారయ్యే ఆహారం తినే వేలాది మంది వినియోగదారుల ఆరోగ్యంపై దాని ప్రభావం ఎలా ఉంటుందన్నదే ప్రధాన ఆందోళన.ఇక్కడ మరో కీలక సమస్య జరిమానాల ప్రభావం. రోజుకు లక్షల రూపాయల వ్యాపారం చేసే పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లకు చిన్న మొత్తంలో జరిమానాలు విధించడం మాత్రమే పరిష్కారంగా మారితే, అది నిరోధక చర్యగా ఎంతవరకు పనిచేస్తుందన్న ప్రశ్న తలెత్తుతుంది. జరిమానా వ్యాపార వ్యయంలో ఒక భాగంగా మారిపోయే పరిస్థితి వస్తే.. నిబంధనలు ఉల్లంఘించకుండా చేయాల్సిన భయం తగ్గే ప్రమాదం ఉంది. అందుకే జరిమానాల పరిమాణం మాత్రమే కాకుండా, ఉల్లంఘన తీవ్రతకు అనుగుణంగా చర్యల తీవ్రత ఉండాలి.అయితే దీనికి పరిష్కారం కేవలం కఠినమైన దాడులు చేయడంలో లేదు. తనిఖీ నుంచి తుది చర్య వరకు మొత్తం వ్యవస్థ పారదర్శకంగా, నిరంతరంగా పనిచేయాలి. లైసెన్స్ రద్దు చేసిన సంస్థ తిరిగి ఎలా కార్యకలాపాలు ప్రారంభించింది? నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తే ఎవరు బాధ్యత వహిస్తారు? మళ్లీ లైసెన్స్ పొందడానికి ఏ నిబంధనలు వర్తిస్తాయి? వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి. ఒకసారి చర్య తీసుకున్న తర్వాత విషయం ముగిసిందనే విధానం కాకుండా, సంబంధిత సంస్థలు నిబంధనలు పాటించే వరకు పర్యవేక్షణ కొనసాగాలి.అలాగే ప్రజల బాధ్యత కూడా ఇక్కడ కీలకం. అధికారులు తీవ్రమైన ఉల్లంఘనలను గుర్తించిన సంస్థల వివరాలను ప్రజలకు స్పష్టంగా అందుబాటులో ఉంచాలి. వినియోగదారులు కూడా కేవలం రుచి, ధర, బ్రాండ్ పేరును చూసి కాకుండా.. పరిశుభ్రత, నాణ్యత, లైసెన్స్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఫిర్యాదుల వ్యవస్థను మరింత సులభతరం చేసి, ప్రజలు ఇచ్చే సమాచారంపై వేగంగా స్పందించే వ్యవస్థ అవసరం.'టీజీ సేఫ్' అనే పేరు కేవలం తనిఖీలు, సీజ్‌లు, నోటీసులు, సోషల్ మీడియా ప్రచారానికి పరిమితం కాకూడదు. ఒక సంస్థపై చర్య తీసుకున్న తర్వాత అది మళ్లీ అదే తప్పు చేయకుండా చూసే బాధ్యత కూడా వ్యవస్థదే. అవసరమైన చోట చట్టపరమైన చర్యలు, కోర్టు ప్రక్రియలు, లైసెన్స్‌పై కఠిన నియంత్రణ, పునరావృత ఉల్లంఘనలకు మరింత తీవ్రమైన శిక్షలు వంటి చర్యలను చట్టపరమైన పరిమితుల్లో సమర్థంగా అమలు చేయాలి.ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఆహార భద్రత విషయంలో ప్రభుత్వానికి ప్రచారం కంటే ఫలితం ముఖ్యం. వందలాది తనిఖీలు జరిగాయని చెప్పడం కంటే.. తనిఖీల తర్వాత ఉల్లంఘనలు ఎంతవరకు తగ్గాయి? లైసెన్సులు రద్దైన సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా తిరిగి తెరుచుకోకుండా ఏ చర్యలు తీసుకున్నారు? వినియోగదారులకు ఎంత మేర భద్రత కల్పించగలిగారు? అన్నదే కొలమానం కావాలి.చివరికి 'టీజీ సేఫ్' విజయాన్ని దాడుల సంఖ్యతో కాదు.. ప్రజలకు అందుతున్న ఆహారం ఎంత సురక్షితంగా మారిందన్న దానితోనే అంచనా వేయాలి. తనిఖీకి, తుది చర్యకు మధ్య ఉన్న గ్యాప్‌ను ప్రభుత్వం పూడ్చగలిగితేనే ఈ వ్యవస్థ తన అసలు లక్ష్యాన్ని సాధించినట్టవుతుంది. లేకపోతే ఎంత ఆర్భాటంగా దాడులు జరిగినా.. అవి తాత్కాలిక సంచలనాలుగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# సుమోటోగా తీసుకుని సుప్రీంకోర్టు విచారణ



**ఢిల్లీ :** దేశ రాజధాని ప్రాంతమైన ఢిల్లీ-ఎన్‌సీఆర్ లో ఇటీవల వరుసగా వెలుగుచూస్తున్న అత్యాచార ఘటనలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా కదులుతున్న స్లీపర్ బస్సులో ఓ మైనర్ బాలికపై జరిగిన అఘాయిత్యం, అలాగే ఇతర లైంగిక దాడి కేసులపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ అమానుష ఘటనలపై సర్వోన్నత న్యాయస్థానం స్వయంగా సుమోటోగా విచారణ చేపట్టింది.

**న్యాయస్థానం తీవ్ర ఆవేదనన.. కీలక వ్యాఖ్యలు**

తాజాగా జరిగిన వరుస అత్యాచాలపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించడంలో జరుగుతున్న తీవ్ర వైఫల్యాలపై అసంతృప్తి వెలిబుచ్చింది. ఈ సందర్భంగా కోర్టు స్పందిస్తూ.. 'ఈ ఘటనలను చూస్తుంటే 2012 నాటి భయానక నిర్భయ ఉదంతాన్ని మరోసారి గుర్తుచేస్తున్నాయి. వాటి మధ్య బాధాకరమైన పోలికలను గమనించకుండా ఉండలేకపోతున్నాం' అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది.

# కామారెడ్డిలో కదం తొక్కిన కాంగ్రెస్..

**కామారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** ఓటు హక్కు పరిరక్షణ, పారదర్శకమైన ఓటర్ల జాబితా, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కామారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. టీపీసీసీ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ నాయకత్వంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బ్లాక్ షర్టులు ధరించి కలెక్టరేట్ కు తరలివచ్చారు. సర్ ప్రక్రియ, ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ను కలిసి ఓటు హక్కు పరిరక్షణ, ఓటర్ల జాబితాలో పారదర్శకత, సర్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై అభ్యంతరాలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి అర్హుడి ఓటు హక్కు రక్షించబడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఇప్ప శ్రీనివాస్, మహమ్మద్ ఇలియాస్, కామారెడ్డి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఐరేని సందీప్ కుమార్, మండల అధ్యక్షులు రాజాగౌడ్, కామారెడ్డి సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కేఆర్ఎంబీ సమావేశం వాయిదా..




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అక్టోబర్ 1న జరగాల్సి ఉన్న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశాన్ని వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అదే రోజు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఫిక్స్ అయి ఉన్నందున, కేఆర్ఎంబీ భేటీకి హాజరుకాలేని పరిస్థితి ఏర్పడిందని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ రమేశ్‌బాబు కేఆర్ఎంబీ చైర్మన్‌కు అధికారికంగా లేఖ రాశారు. అక్టోబర్ 1న సీఎం అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ భేటీ జరగనుండటంతో, పలు కీలక పాలనాపరమైన అంశాలపై చర్చించాల్సి ఉందని ఆ లేఖలో పేర్కొన్నారు.

**కొత్త తేదీని కేటాయించాలని విజ్ఞప్తి..**

మంత్రివర్గ సమావేశం కారణంగా నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ఆ భేటీలో బిజీగా ఉంటారని, కాబట్టి కేఆర్ఎంబీ సమావేశాన్ని వేరొక తేదీకి వాయిదా వేయాలని కోరారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని సమావేశానికి తగిన వేరే తేదీని ఖరారు చేయాలని ఈఎన్‌సీ తన లేఖలో కేఆర్ఎంబీని కోరారు.



# ఫార్మాసిటీ రద్దు చేసి.. భూములు తిరిగి ఇవ్వాలి

**ఇబ్రహీంపట్నం,ఫ్లాష్ ఇండియా :** యాచారం ప్రాంతంలో ప్రతిపాదించిన ఫార్మాసిటీని రద్దు చేసి, ప్రభుత్వం సేకరించిన తమ భూములను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ యాచారం మండలానికి చెందిన ఫార్మా బాధిత రైతులు సోమవారం ఇబ్రహీంపట్నంలోని ప్రజాభవన్‌ను ముట్టడించారు. పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. జీవో నంబర్ 31ను అమలు చేసి, ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను తిరిగి రైతులకు అప్పగించాలని కోరారు. తమ భూముల సమస్య పై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మాసిటీ ప్రతిపాదనను రద్దు చేసి తమ భూములను తిరిగి ఇచ్చే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు. ప్రజాభవన్ వద్ద పెద్ద సంఖ్యలో రైతులు ఆందోళనకు దిగడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తమ డిమాండ్ల పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, తక్షణమే న్యాయం చేయాలని రైతులు కోరారు.

# 'పీఎఫ్' మాయం.. కార్మికుల్లో ఆవేదన!

- జీతాల నుంచి పీఎఫ్ కోతలు.. ఖాతాల్లో మాత్రం జమ కాని వైనం
- మార్చి నుంచి సెప్టెంబర్ వరకు ఏడు నెలల బకాయిలపై కార్మికుల ఆవేదన
- మున్సిపాలిటీపై పెనాల్టీలు, వడ్డీ భారం పడే ప్రమాదం
- పీఎఫ్ నిధుల చెల్లింపులపై సమగ్ర లెక్కలు వెల్లడించాలని డిమాండ్

**ఆలేరు,ఫ్లాష్ ఇండియా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సొమ్ము చెల్లింపుల వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఎండనక, వాననక పట్టణాన్ని శుభ్రం చేసే పేద కార్మికుల వేతనాల నుంచి ప్రతి నెలా పీఎఫ్ పేరుతో క్రమం తప్పకుండా సొమ్మును మినహాయిస్తున్న అధికారులు.. ఆ మొత్తాన్ని సంబంధిత పీఎఫ్ సంస్థకు జమ చేయడంలో ఘోర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మార్చి 2026 నుంచి సెప్టెంబర్ 2026 వరకు వరుసగా ఏడు నెలల పాటు జీతాల్లో కోతలు పెట్టినా పీఎఫ్ ఖాతాల్లో పైసా జమ కాకపోవడంతో కార్మికులు లబోదిబోమంటున్నారు.

**జీతాల్లో కోత.. ఖాతాల్లో శూన్యం..**

కార్మికులకు నెలాఖరున ఇచ్చే అరకొర వేతనాల నుంచే పీఎఫ్ కోతలు విధిస్తున్నారు. అయితే తమ వ్యక్తిగత ఖాతాల స్టేట్‌మెంట్లను పరిశీలిస్తే గత ఏడు నెలలుగా ఎలాంటి నిధుల జమ కనిపించడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం కార్మికుల వాటాతో పాటు పురపాలక సంఘం చెల్లించాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ (యాజమాన్య వాటా) రెండింటినీ కలిపి ప్రతి నెలా 15వ తేదీలోగా పీఎఫ్ సంస్థకు చలాన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఆలేరు బల్దియా అధికారులు ఈ ప్రక్రియను గాలికొదిలేయడంతో అసలు కట్ చేసిన సొమ్ము ఎక్కడికి మళ్లించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**మున్సిపాలిటీ పై వడ్డీ భారం..**

పీఎఫ్ నిబంధనల ప్రకారం నిర్దేశిత గడువులోగా చెల్లింపులు చేయకపోతే ఈపీఎఫ్ఓ సంస్థ భారీగా పెనాల్టీలు, చక్రవడ్డీ విధిస్తుంది. ఇప్పటికే నిధుల లేమితో సతమతమవుతున్న ఆలేరు మున్సిపాలిటీ పై ఈ నిర్లక్ష్యం కారణంగా రూ.లక్షల అదనపు ఆర్థిక భారం పడే ముప్పు పొంచి ఉంది. అధికారుల అలసత్వం వల్ల ఏర్పడే ఈ వడ్డీ భారాన్ని ఎవరి నుంచి వసూలు చేస్తారని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

**లెక్కలు తేల్చాల్సిందే..**

కార్మికుల భవిష్యత్, పదవీ విరమణ భరోసా కోసం ఉద్దేశించిన పొదుపు మొత్తాన్ని అధికారులు తమ సొంత అవసరాలకో, దారి మళ్లించడానికో వాడటం చట్టవిరుద్ధమని కార్మిక నేతలు మండిపడుతున్నారు. మార్చి 2026 నుంచి ఇప్పటివరకు కార్మికుల వేతనాల నుంచి మినహాయించిన మొత్తం ఎంత?, మున్సిపాలిటీ వాటా ఎంత విడుదల చేశారు?, ఇప్పటివరకు చెల్లించిన చలాన్ల వివరాలేమిటి?. అనే విషయాలపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల పీఎఫ్ బకాయిలను వెంటనే జమ చేసి, బాధ్యులైన అధికారులపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

# రూ.కోట్లలో కుంభకోణం

- సన్న వడ్లకు దొడ్డు బియ్యం.. మిల్లర్ల మాయాజాలం
- సర్కారు ధాన్యం పక్కదారి.. ఎఫ్‌సీఐకి నాసిరకం బియ్యం?
- రూ.300 కోట్ల వరకు ప్రభుత్వానికి నష్టం.. అధికారుల పాత్రపై అనుమానాలు
- మిల్లర్లు-అధికారుల కుమ్మక్కుతోనే అక్రమాలు జరిగాయా?



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మామూలుగా అయితే సన్నవడ్లకు సన్నబియ్యం రావాలి. కానీ, తెలంగాణలోని అనేక మిల్లుల్లో మాత్రం సన్నవడ్లకు దొడ్డు బియ్యం వస్తున్నాయి. అదే మన మిల్లుల్లోని సాంకేతిక పరిజ్ఞానం. ఇక్కడి మిల్లర్ల ఘనకార్యం అదంతా.. రోజురోజుకూ పెరుగుతున్న టెక్నాలజీ వలన ఇలాంటి చిత్రవిచిత్రాలు కూడా జరుగుతున్నాయి. ఇది వినడానికి విచిత్రంగానే ఉన్నా... వాస్తవంగా జరుగుతున్నది అదే. రైస్‌మిల్లర్ల కుంభకోణాలు, అక్రమాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తూనే ఉన్నాయి. రైస్‌మిలర్లుకు తోడునీడగా పౌరసరఫరాల శాఖ అధికారులు నిలవడంతో అక్రమాలు, అవినీతి, స్కామ్స్‌కు అంతు లేకుండా పోతోంది. ఎక్కడ చూసినా కోట్ల రూపాయల కుంభకోణాలే బయటికు వస్తున్నాయి.

**అక్రమాలు పెరిగాయి...**

సన్నబియ్యం విధానం అమల్లోకి వస్తే ఈ కుంభకోణాలు, అక్రమాలు తగ్గుతాయని అంతా భావించారు. ప్రభుత్వం ఎక్కువగా సన్న వడ్లు సేకరించి కస్టమ్ మిల్లింగ్ కోసం మిలర్లకు అప్పగిస్తుంది. అయితే, ఆ సన్న వడ్లను బియ్యంగా మార్చి బహిరంగ మార్కెట్లో మిల్లర్లు అమ్ముకుంటున్నారు. డబ్బులు వెనకేసుకుంటున్నారు. ఎఫ్‌సీఐకి మాత్రం దొడ్డు బియ్యాన్ని సరఫరా చేస్తున్నారనేది ఇక్కడ ప్రధాన ఆరోపణ. ఇందులో కొంతమొత్తం వరకు సన్న బియ్యాన్ని సరఫరా చేసి మొత్తం సన్న బియ్యమే సరఫరా చేశామని లెక్కలు చెబుతున్నారు. తెల్ల రేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగానే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి చూపించింది. రైతులు సన్న వడ్లు పండించాలనే ఉద్దేశంతో వారికి క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను అందిస్తోంది.

**సన్నవడ్లకు దొడ్డు బియ్యం**

దీంతో సన్న వడ్లకు దాదాపుగా క్వింటాల్‌కు రూ.2,900 చెల్లించి సేకరిస్తుంది. ఈ బియ్యాన్ని రైస్ మిలర్లకు అందించి వారి నుంచి సన్న బియ్యాన్ని సేకరిస్తుంది. అయితే, ఇక్కడ కూడా మిల్లర్లు తమ చేతివాటాన్ని చూపించారు. ప్రభుత్వం తమకు కేటాయించిన సన్న బియ్యాన్ని ప్రభుత్వానికి సరఫరా చేస్తూనే దాదాపుగా 16 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పక్కదారి పట్టించినట్టు అంచనా వేశారు. ఈ బియ్యాన్ని ప్రభుత్వానికి కాకుండా బహిరంగ మార్కెట్లో మిల్లర్లు అమ్ముకున్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)కి అందించే బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసి, గతంలో అందుబాటులో ఉన్న దొడ్డు బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించినట్టుగా చెబుతున్నారు. ఎఫ్‌సీఐకి కామన్‌గ్రేడ్‌సరఫరాకు ఎంత మొత్తం అయితే ఇస్తారో అంతే తమకు చెల్లిస్తే సరిపోతుందని మిల్లర్లు చెప్పారు. ఈ విషయాన్ని లోతుగా పరిశీలిస్తే గానీ అసలు విషయం బోధపడలేదు. ఎఫ్‌సీఐకి కామన్‌గ్రేడ్ సరిపోతుందని, అంచనాతోనే మిల్లర్లు కుమ్మక్కు అయి బియ్యాన్ని సరఫరా చేసినట్టుగా చెబుతున్నారు. వాస్తవంగా సన్నవడ్లకు సన్న బియ్యం సరఫరా చేయాలి. కానీ, అలా జరగలేదు... సన్న వడ్లకు దొడ్డు బియ్యాన్ని సరఫరా చేశారని గుర్తించారు.

**రూ.300 కోట్ల వరకు నష్టం..**

దీంతో పౌరసరఫరాల శాఖకు దాదాపుగా రూ.300 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని అంచనా. సన్నరకం వడ్లకు దొడ్డు బియ్యం సరఫరా చేయడం ద్వారా భారీ మొత్తంలో నష్టం జరిగిందని, మిల్లర్లు భారీగా లబ్ధిపొందారని తెలిసింది. పౌరసరఫరాల శాఖ అధికారుల లెక్కల ప్రకారం.. ఒక లారీ ధాన్యానికి (435 క్వింటాల్‌కు) దాదాపుగా రూ.2.20 లక్షల నష్టం జరుగుతుందని అంచనా వేశారు. ఇలా బెడ్ స్థాయికి వచ్చేసరికి ఒక్కో బెడ్‌కు ప్రభుత్వానికి రూ.15 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రజాధనం దోచుకున్నారని ఆరోపణలొచ్చాయి. ఇందులో సివిల్‌సప్లయ్ అధికారుల పాత్ర ఉందని కీలక సమాచారం. వారి సహకారంతోనే ఇదంతా జరుగుతుందని మిల్లర్లు సైతం అనధికారికంగా అంగీకరిస్తున్నారు. సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్‌లోని కొందరు అవినీతి అధికారుల ప్రమేయం, రైసు మిల్లర్ల కక్కుర్తి వ్యవహారాలతో ఇలాంటి జరుగుతున్నాయని, వీటి వల్ల ప్రభుత్వానికి, ప్రజాధనాన్ని దోచుకుంటున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



# వనపర్తి జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన..

**వనపర్తి,ఫ్లాష్ ఇండియా :** ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాల అభ్యున్నతికి పెద్దపీట వేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. సోమవారం ఉదయం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వనపర్తి జిల్లాలో పర్యటిస్తున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో రూ.12 కోట్లతో నూతనంగా నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు, రూ.10 కోట్లతో నిర్మాంచనున్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులకు పశుసంవర్ధక క్రీడల యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్థానిక ఎమ్మెల్యే తోడి మెగారెడ్డ స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, అనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ రోమీలతో కలిసి శంకుస్థాపన చేశారు. అనపర్తి జిల్లా కేంద్రంలోని నల్లచెరువు నీటిలో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల చేత ఎన్నుకోబడ్డ కార్పొరేట్ స్కూల్‌లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలలో కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న తాపత్రయంతో ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం గడిచిన 30 నెలల్లో ప్రజా ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కల నెరవేరుస్తూ, వసతి గృహాల్లోని విద్యార్థులకు కాస్మొటిక్ మెస్ ఛార్జీలు 212% పెంచిందని, మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం విద్యార్థులకు అల్పాహారం అందిస్తుందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఒక రేషన్ కార్డు ఇవ్వలేదని ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేసి ప్రతి ఒక్కరికి సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు.

# కేంద్రంతో పాటు ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐకి సుప్రీంకోర్టు నోటీసులు

**ఢిల్లీ :** రూ.2 వేలకు మించిన యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ ఛార్జీల విధింపునకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇవాళ విచారణ చేపట్టింది. ఈ వివాదాస్పద అంశంపై కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. రూ.2 వేలు దాటిన యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తూ ఈనెల 14న కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం డిజిటల్ లావాదేవీలపై ప్రభావం చూపుతుందని భావిస్తూ.. న్యాయవాది అంజన్ దత్తా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కొత్త నిబంధనల వల్ల వ్యాపారులు అదనపు భారాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని, ఇది పరోక్షంగా వినియోగదారులపై, చిన్న వ్యాపారాలపై ప్రభావం చూపుతుందని వాదించారు. దీంతో దేశ సర్వోన్నత న్యాయస్థానం సదరు అంశంపై స్పందించాల్సిందిగా కోరుతూ కేంద్రం, ఆర్బీఐ, ఎన్పీసీఐలకు నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై తదుపరి విచారణలో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా, దేశ వ్యాప్తంగా అక్టోబర్ 15 నుంచి కొత్త ఎండీఆర్ అమల్లోకి రానుంది. రూ.2 వేల లోపు ఉన్న లావాదేవీలు, అలాగే వ్యక్తిగత బదిలీలు ఎప్పటిలాగే పూర్తిగా ఉచితంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. డిజిటల్ పేమెంట్స్ మౌలిక వసతులు, సైబర్ సెక్యూరిటీని మరింత బలోపేతం చేయడానికి ఈ ఛార్జీలు దోహదపడతాయని ప్రభుత్వ, నియంత్రణ వర్గాలు వాదిస్తున్నాయి.

# ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు



**మేడిపల్లి,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను పురస్కరించుకొని వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ ఉప్పల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఉప్పల్ నియోజకవర్గం శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు గుళ్ళపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి నాగుల సురేష్, ఆడెపు బాలరాజ్, ఎస్ నాగరాజు, ఎన్ శ్రీనివాస్, స్థానిక నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యమే కీలకం



**నల్లగొండ జిల్లా / చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యమే కీలకమని గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న అన్నారు.తీదేడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో VB-G RAM-Gపై గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఉలుపాల స్వప్న మాట్లాడుతూ.. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఉపాధి అవకాశాలు, నీటి సంరక్షణ, గ్రామీణ మౌలిక వసతులపై గ్రామస్థులతో చర్చించారు.తీదేడు గ్రామ అభివృద్ధే మా ప్రధాన లక్ష్యం. గ్రామంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తాం.గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలు, అవసరాలను స్వేచ్ఛగా తెలియజేయాలి. ప్రజల సూచనలతో పారదర్శకంగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించి, గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆమె అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.గ్రామ సభలో గ్రామస్థులు పాల్గొని పలు సమస్యలు, అభివృద్ధి అవసరాలను పంచాయతీ దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పాలక వర్గం సభ్యులు బొడ్డు పార్వతమ్మ మాదగోని కృష్ణ గౌడ్, దాసరి కళమ్మ రెడ్డి పద్మ మర్ల యాదగిరి, శివర్ల పర్వతాలు యాదవ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్,గ్రామస్తులు సిమర్ల శ్రీను ,చింతకుంట్ల రాకేష్,బెక్కం శ్రీను,తిరమని యాదయ్య,వలమోని వెంకటయ్య,ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రయ్య,అంగన్వాడి టీచర్లు, ఏ.యన్.యం లు ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణంలోని ఎస్వీ గార్డెన్స్ నందు మిర్యాలగూడ నియోజకవర్గ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పౌర సరఫరాలు మరియు నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి , మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్,జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ప్రజలు,పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

**కాంగ్రెస్ కార్యకర్తల త్యాగాలను గుర్తుంచుకుంటాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో లేకపోయినా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తుపెట్టుకుంటామని అన్నారు.కార్యకర్తల త్యాగాలు, కృషి ఫలితంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు.

**సాగర్ నీళ్లపై రాజకీయాలు హాస్యాస్పదం**

సాగర్ జలాల కోసం బీఆర్ఎస్ నేతలు ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి వ్యాఖ్యానించారు.సాగర్ జలాశయంలో సరిపడా నీరు ఉంటే పంటలకు నీరు ఇవ్వకుండా ప్రభుత్వం ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఎల్ నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు నల్గొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు... మిర్యాలగూడ నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలతో పాటు పలు అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

**ప్రజా పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముతక బియ్యం అక్రమ మార్కెట్‌కు తరలిపోయేదని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని తెలిపారు...రాష్ట్రంలో 3.42 కోట్ల మందికి ఒక్కొక్కరికి నెలకు ఆరు కిలోల ఉచిత సన్నబియ్యం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దేశంలోనే సన్నబియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తోందని మంత్రి అన్నారు.

**వారం రోజుల్లో కొత్త రేషన్ షాపులు**

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విజ్ఞప్తి మేరకు మిర్యాలగూడ నియోజకవర్గంలో వారం రోజుల్లోనే కొత్త రేషన్ షాపులను మంజూరు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

**నల్గొండ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట**

నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.కాంగ్రెస్ పార్టీ మళ్లీ రెండోసారి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓట్ల చోరీకి పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని మంత్రి ఆరోపించారు. దేశ ప్రజలందరూ రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా అధికారులు,మిర్యాలగూడ ఆర్డీవో ఎస్ రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుధా బాలకృష్ణ,కమిషనర్ శ్రీజ రెడ్డి,ప్రజాప్రతినిధులు, సర్పంచులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, లబ్ధిదారులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి కార్మిక విభాగం సూర్యాపేట ఇన్చార్జిగా పాలకుర్తి శేషగిరిరావు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గత నాలుగు దశాబ్దాలుగా పార్టీ సిద్ధాంతాల పట్ల సమాజం పట్ల వారికి ఉన్న నిబద్ధత క్రమశిక్షణ సమర్థవంతమైన సేవలను గుర్తించి సమగ్ర సమీక్ష సీనియర్ నాయకుల సలహాల మేరకు భారతీయ జనతా పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్ ఆధ్వర్యంలో (లేబర్ సెల్) కార్మిక విభాగం సూర్యాపేట జిల్లా ఇంచార్జిగా పాలకుర్తి శేషగిరిరావును నియమించడమైనది.బీజేపీ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్ చేతుల మీదుగా పాలకుర్తి శేషగిరిరావు నియామక పత్రాన్ని అందుకున్నారు. తనపై నమ్మకం ఉంచి తనకు అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వహిస్తూ, కార్మికుల సమస్యలు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా పనిచేస్తూ కార్మికుల సంక్షేమానికి పాటుపడుతూ సంస్థ బలోపేతానికి కృషి చేస్తానని పాలకుర్తి శేషగిరిరావు తెలిపారు.



- చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- బీజేపీ చేతిలో కీలుబొమ్మలా మారిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్
- 'ఓటు చోరీ' ఆరోపణలపై నల్లగొండ కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ ధర్నా

# చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

**నల్లగొండ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR), ఓటర్ల పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై కాంగ్రెస్ పార్టీ లేవనెత్తుతున్న అభ్యంతరాల నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్‌కుమార్ గౌడ్ సూచన మేరకు, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ "ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడి హక్కు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటు సురక్షితంగా ఉండేలా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగాలి. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి" అని అన్నారు.

**సీఈసీ రాజీనామా చేయాలి: ఎమ్మెల్యే బాలు నాయక్**

"ఓటర్ల జాబితా, SIR ప్రక్రియకు సంబంధించి అనేక అంశాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు కూడా కొన్ని అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించి, ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది" అని బాలు నాయక్ అన్నారు. ఈ అంశాలపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. "ఓటర్ల జాబితాలో ఎవరి పేర్లు తొలగించబడ్డాయి, ఎందుకు తొలగించబడ్డాయి, ఏ విధానాన్ని అనుసరించారు అనే విషయాలపై పారదర్శకత అవసరం. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చూడాలి. ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మకం మరింత బలపడేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలి" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**'ఓటు చోరీ'పై సమగ్ర వివరణ ఇవ్వాలి**

కాంగ్రెస్ పార్టీ లేవనెత్తుతున్న 'ఓటు చోరీ' ఆరోపణలపై సమగ్ర, స్వతంత్ర పరిశీలన జరగాలని బాలు నాయక్ కోరారు. SIRలో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల తొలగింపు, ఓటర్ల డేటా నిర్వహణ తదితర అంశాలపై వచ్చిన అభ్యంతరాలకు ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని అన్నారు.

"ఓటు అనేది ప్రజల ప్రజాస్వామ్య హక్కు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకత ఉండాలి. ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో తన నిరసనను తెలియజేస్తోంది" అని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు.

**భారీగా పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు**

నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ధర్నా అనంతరం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో చేపడుతున్న నిరసనల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

# చౌడాపూర్ మండల కేంద్రంలో అంగన్వాడి సిబ్బందికి సన్మానించిన బిజెపి మండల అధ్యక్షులు బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో



**వికారాబాద్ జిల్లా/ చౌడాపూర్ మండల, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని బిజెపి చేపట్టిన సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా ఈరోజు చౌడాపూర్ మండల కేంద్రంలో 'అంగన్ మిలాన్ సేవ' కార్యక్రమం లో భాగంగా అంగన్వాడి చిన్నపిల్లలకు స్వీట్లు బిస్కెట్లు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు బందయ్యా,మండల ప్రధాన కార్యదర్శి,వెంకటేష్, బాలరాజ్,ప్రవీణ్,నర్సింలు,నరేష్ రాము,రఘు,మల్లేష్

# రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** రైతు సంఘం జాతీయ మహాసభలను నవంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు నల్లగొండలో నిర్వహిస్తున్న సందర్భంగా, మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నల్లగొండ మండలం అనంతారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున మాట్లాడుతూ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ మహాసభలకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు వేలాదిగా రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. రైతాంగ సమస్యలను జాతీయ స్థాయిలో చర్చించి,వాటి పరిష్కారం కోసం జరిగే ఈ మహాసభల్లో రైతులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండ అనురాధ,మండల కమిటీ సభ్యులు పోలే సత్యనారాయణ,కొండ వెంకన్న,మానుపాటి ఎల్లయ్య, గ్రామ కార్యదర్శి రాములు అంజయ్య,నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం..



**మేడ్చల్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** సర్ ప్రక్రియలో జరుగుతున్న అవకతవుకలపై ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో సర్ అక్రమాలపై వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న వైయస్సార్ విగ్రహం నుంచి మేడ్చల్ అంబేద్కర్ విగ్రహం వరకు వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కును కాపాడవలసిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు.సర్ ప్రక్రియపై ప్రజల్లో ఉన్నఅనుమానాలు,అభ్యంతరాలను ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకుని అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం చేయాలని వజ్రేష్ యాదవ్ కోరారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, అర్హులైన ప్రతి ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.ఇందులో డీసీసీ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి,రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మల్కాజ్గిరి ఇంచార్జ్ లక్ష్మీ కాంత్ రెడ్డి,టీపీసీసీ ప్రధాన కరదర్శి పీసరి మైపాల్ రెడ్డి జిల్లా, మండల, మల్కాజ్గిరి మున్సిపాలిటీ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో యునైటెడ్ ఒగ్గు మెన్స్ వేర్ గ్రాండ్ ఓపెనింగ్..






**మిర్యాలగూడ ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ పట్టణంలో యునైటెడ్ ఒగ్గు మెన్స్ వేర్ నూతన షోరూమ్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఇన్‌స్టాగ్రామ్ సెలబ్రిటీ జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణ ప్రజలకు అతి తక్కువ ధరల్లో బ్రాండెడ్ వస్త్రాలను అందించడమే లక్ష్యంగా యునైటెడ్ ఒగ్గు మెన్స్ వేర్ ముందుకు సాగుతోందన్నారు. షోరూం యజమాన్యం ప్రవీణ్ రెడ్డి,శశి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఇది 16వ బ్రాంచ్‌గా ప్రారంభం కావడం ఎంతో గర్వకారణంగా ఉందని తెలిపారు.షోరూమ్‌లో పురుషులకు అవసరమైన వివిధ రకాల బ్రాండెడ్ వస్త్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. నాణ్యతతో పాటు అందుబాటు ధరల్లో వస్త్రాలను అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# ఎస్ ఎన్ మ్యూజిక్ అకాడమీ 22వ వార్షికోత్సవ వేడుకలు



**హైదరాబాద్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** సంకీర్తన కల్చరల్ సొసైటీ 14వ మరియు ఎస్ ఎన్ మ్యూజిక్ అకాడమీ 22 వ వార్షికోత్సవం రవీంద్రభారతి లో ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా ఈగ మల్లేశం అధ్యక్షులు ఆర్టీసీఎన్ వెల్ఫేర్ కౌన్సిల్ రెండు రాష్ట్రాలకు తెలంగాణా ఉ ఆంధ్రప్రదేశ్ కు పాల్గొన్నారు. రాధికా జోషి కి పండిట్ ఆత్మరామం శర్మ మెమోరియల్ అవార్డు ప్రాధానం చేశారు. ఈ సంస్థ ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్,. అధ్యక్షులు గుమ్మడి జనార్దన్ ఆధ్వర్యంలో సభను నిర్వహించిన్నారు.

# వినాయక నిమజ్జనంలో విషాదం..

**గజ్వేల్,ఫ్లాష్ ఇండియా :** గజ్వేల్ మండలం సింగాటం గ్రామంలో వినాయక నిమజ్జన వేడుకల్లో విషాద ఘటన చోటుచేసుకుంది. గజ్వేల్ సీఐ రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 27న ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా డీజే నిర్వహించారు. ఈ క్రమంలో కొలుగూరు గ్రామానికి చెందిన బండారి దినేష్ (22) రాత్రి 9 గంటల సమయంలో డీజే ఆపరేట్ చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే స్పందించిన స్థానికులు దినేష్‌కు సీపీఆర్ చేసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే యువకుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు.



# విరాట్ కోహ్లీ సమాధానాలు ఇవే!

టీమిండియా స్టార్ బ్యాటర్, రికార్డుల రారాజు విరాట్ కోహ్లీ లేటెస్ట్ ర్యాపిడ్ ఫైర్ రౌండ్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. తన కెరీర్‌లోని ఇష్టాలు, అభిమానించే ఆటగాళ్లు, అత్యుత్తమ భాగస్వాములు, ఎదుర్కొన్న కఠినమైన బౌలర్ల గురించి కింగ్ సూటిగా సమాధానాలు ఇచ్చాడు. ఈ క్రమంలో రోహిత్ శర్మ, ఎంఎస్ ధోనీ, జస్ప్రీత్ బుమ్రా, ఏబీ డివిలియర్స్ వంటి స్టార్ ఆటగాళ్ల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. ఇష్టమైన బ్యాటింగ్ భాగస్వామి ఎవరని అడగ్గా.. ఎలాంటి ఆలోచన లేకుండా రోహిత్ శర్మ పేరును విరాట్ కోహ్లీ చెప్పాడు. రోహిత్‌తో కలిసి బ్యాటింగ్ చేయడంలో తనకు ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని ఈ సమాధానం మరోసారి చాటింది. తన కెరీర్‌లో ఎదుర్కొన్న అత్యంత కఠినమైన బౌలర్‌గా జస్ప్రీత్ బుమ్రాను పేర్కొన్నాడు. తనకు ఇష్టమైన ప్రత్యర్థి జట్టు ఏదని ప్రశ్నించగా.. పాకిస్థాన్ అని సమాధానమిచ్చాడు. తనకు అత్యంత ఇష్టమైన క్రికెట్ మైదానం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం అని కోహ్లీ చెప్పాడు. తన కెరీర్‌లో ఆడిన కెప్టెన్లలో అత్యుత్తమ కెప్టెన్ ఎవరని అడిగితే.. ఎంఎస్ ధోనీ అని విరాట్ కోహ్లీ పేర్కొన్నాడు. ధోనీని ఒక్క మాటలో అభివర్ణించాల్సి వస్తే 'మాస్టర్‌మైండ్' అని చెప్పాడు. తన ప్రైమ్‌లో ఉన్నప్పుడు ఎవరిని ఎదుర్కోవడానికి ఇష్టపడరని అడగ్గా.. దక్షిణాఫ్రికా మాజీ పేసర్ డేల్ స్టెయిన్ పేరును చెప్పాడు. తనతో కలిసి ఆడిన అత్యుత్తమ ఫీల్డర్‌గా దక్షిణాఫ్రికా మాజీ స్టార్ ఏబీ డివిలియర్స్‌ను కోహ్లీ ఎంపిక చేశాడు. టీ20 లేదా వన్డేల్లో ఏ ఫార్మాట్‌ను ఇష్టపడతావని అడగ్గా.. వన్డే క్రికెట్ అని సమాధానమిచ్చాడు. అయితే వన్డే లేదా టెస్టు క్రికెట్‌లో ఏది ఇష్టమని ప్రశ్నించగా.. టెస్టు క్రికెట్ తన ఎంపిక అని కోహ్లీ స్పష్టం చేశాడు. భారత ఆటగాళ్లలో తాను అత్యంత అభిమానించే క్రికెటర్ ఎవరని అడగ్గా.. మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ పేరును కింగ్ కోహ్లీ చెప్పాడు. ఇక మ్యాచ్‌ను కేవలం కొన్ని నిమిషాల్లోనే మలుపు తిప్పగల ఆటగాడు ఎవరని ప్రశ్నించగా.. వెస్టిండీస్ స్టార్ ఆండ్రీ రస్సెల్ పేరును పేర్కొన్నాడు. చివరగా రోహిత్ శర్మను ఒక్క మాటలో ఎలా అభివర్ణిస్తావని అడగ్గా 'ఎఫర్ట్‌లెస్' అని కోహ్లీ చెప్పాడు. ఎంఎస్ ధోనీని 'మాస్టర్‌మైండ్', రోహిత్‌ను 'ఎఫర్ట్‌లెస్'గా పేర్కొంటూ కోహ్లీ ఇచ్చిన సమాధానాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

# భారత్‌కు కలిసొచ్చిన వర్షం..




జపాన్‌లోని నాగోయాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో వర్షం ఆటంకం కలిగించింది. భారత్, ఆఫ్ఘనిస్థాన్ పురుషుల క్రికెట్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వాన కారణంగా రద్దైంది. దీంతో మెరుగైన ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ ఆధారంగా భారత జట్టు నేరుగా సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. నిజానికి మ్యాచ్ ప్రారంభానికి ముందు కాస్త వర్షం తగ్గడంతో కవర్లు తొలగించకపోయినా ఆటగాళ్లు మైదానంలోకి వచ్చారు. త్వరలోనే మ్యాచ్ మొదలవుతుందని అంతా అనుకుంటున్న సమయంలో మళ్లీ వాన మొదలైంది. ఎంతకీ వర్షం తగ్గకపోవడంతో చేసేదేమీ లేక మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు, అధికారులు చివరకు ప్రకటన చేశారు. ర్యాంకింగ్స్ పరంగా భారత్ ముందంజలో ఉండటంతో మన టీమ్‌కు సెమీస్ బెర్త్ సులువుగా దక్కింది. ఇక, గతంలో హ్యాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో కూడా సరిగ్గా ఇలాగే వర్షం వల్ల మ్యాచ్ రద్దై భారత జట్టుకు స్వర్ణ పతకం దక్కింది. ఇప్పుడు మళ్లీ అదే రిపీట్ కావడంతో ఆఫ్ఘనిస్థాన్ జట్టు తీవ్ర నిరాశకు గురవ్వగా, మన టీమ్‌కు మాత్రం ఇది పెద్ద ఉపశమనంలా మారింది. ఈ దెబ్బతో భారత ఆటగాళ్లకు కాస్త విశ్రాంతి లభించడమే కాకుండా, జపాన్‌లోని పండుగ వాతావరణాన్ని ఆస్వాదించే అవకాశం దక్కింది. అంతేకాకుండా, అక్కడ జరుగుతున్న ఇతర ఆటల్లో పోటీపడుతున్న భారత్ అథ్లెట్లను ప్రత్యక్షంగా చూస్తూ వారిని ప్రోత్సహించేందుకు మన క్రికెటర్లకు తగినంత సమయం దొరికినట్లయింది.

**ఆఫ్ఘనిస్థాన్ స్క్వాడ్:** మహ్మద్ అక్రమ్, హసన్ ఈసాఖిల్, కరీం జనత్, ఫైసల్ షినోజాదా, నజీబుల్లా జద్రాన్, మహ్మద్ ఇషాక్(w), దర్విష్ రసూలి(c), నంగేలియా ఖరోటీ, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, ఫరీదూన్ దావూద్‌జాయ్, అరబ్ గుల్ అహ్మద్‌జాయ్, ఎఫ్. ఇమ్రాన్ మీర్

**భారత జట్టు:** సంజు శాంసన్(w), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్(c), తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, వాషింగ్టన్ సుందర్, యశ్ ఠాకూర్, వైభవ్ సూర్యవంశీ, విప్రజ్ నిగమ్

# ఆసియా గేమ్స్‌లో ఓటమిపై పీవీ సింధు పోస్ట్



ఆసియా గేమ్స్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఓటమిపాలైన సంగతి తెలిసిందే. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌లో చైనా స్టార్ చెన్ యుఫీ చేతిలో సింధు పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ ఓటమి అనంతరం సింధు ఆసియా క్రీడల నిర్వాహకులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 18 గంటల్లో 3 మ్యాచ్‌లు పెట్టడం వల్ల తగినంత విశ్రాంతి దొరకలేదని, దీంతో కాళ్లు కదలలేదని తెలిపింది. ఈ క్రమంలో మళ్లీ తాజాగా ఎక్స్ వేదికగా నిరాశ వ్యక్తం చేస్తూ పోస్ట్ పెట్టింది. కీలక కోర్టులో వీడియో రివ్యూ సదుపాయం లేకపోవడాన్ని కూడా ప్రస్తావించింది. 'ఆసియా గేమ్స్‌లో నా ప్రయాణం ముగిసింది. కానీ ఆ ఓటమి బాధ నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నా. క్వార్టర్ ఫైనల్‌లో మ్యాచ్‌ను ముగించేందుకు దగ్గరగా వచ్చిన ఆ మూడు పాయింట్లు నన్ను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. దాని గురించే మళ్లీ మళ్లీ ఆలోచిస్తూ ఉన్నా. ఆసియా గేమ్స్ లాంటి కీలక టోర్నీల్లో వీడియో రిఫరల్ సదుపాయం అందుబాటులో లేకపోవడం బాధాకరం. రెండో గేమ్‌లో కొన్ని కీలక లైన్ కాల్స్ తనకు అనుకూలంగా వచ్చి ఉంటే మ్యాచ్ పరిస్థితి మారేదేమో! 18 గంటల్లో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి వచ్చింది. ఇది శరీరంపై ప్రభావం చూపింది' అని సింధు వెల్లడించింది.

**ఈ ఓటమి నా ప్రయాణాన్ని నిర్ణయించదు..**

ఓటమితో బాధపడుతున్నప్పటికీ.. ఇప్పటివరకు సాగిన తన ప్రయాణంపై సింధు గర్వం వ్యక్తం చేసింది. '2014లో నా తొలి ఆసియా గేమ్స్ నుంచి ఇప్పటి నాలుగో ఆసియా గేమ్స్ వరకు.. 12 ఏళ్లుగా భారత్ కోసం నా సర్వస్వం ధారపోశాను. ఈ ప్రయాణం నాకు ఎంతో ప్రత్యేకమైనది. అందుకే ఈ క్షణాన్ని కూడా అనుభూతి చెందనివ్వాలి. ఒక్క బాధాకరమైన ఫలితం నా మొత్తం ప్రయాణాన్ని నిర్వచించలేదు. నా టీమ్‌తో కలిసి ఇప్పటికే జరిగిన తప్పులపై సమీక్షిస్తున్నా. వాటిని సరిదిద్దుకుంటా. నేను బాధపడుతున్నా.. అన్న మాట వాస్తవం. ఇంతగా బాధపడుతున్నానంటే ఇప్పటికీ నాకు ఈ ఆటపై అంతే ప్రేమ ఉందని అర్థం. నాకు ఇంకా గెలవాలనే కోరిక ఉంది. కోర్టులో నా సర్వస్వం ఇస్తూనే ఉంటా' అని సింధు ధీమా వ్యక్తం చేసింది.

# అఫ్గానిస్థాన్‌తో మ్యాచ్ రద్దు.. సెమీస్‌కు భారత్




ఆసియా క్రీడలు 2026లో భాగంగా నేడు జరగాల్సిన భారత్-అఫ్గానిస్థాన్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ రద్దు అయింది. భారీ వర్షం కారణంగా టాస్ పడకుండానే మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు వచ్చిన టీమిండియానే.. సెమీస్‌కు అర్హత సాధించింది. దురదృష్టవశాత్తు మ్యాచ్ ఆడకుండానే అఫ్గాన్ టోర్నీ నుంచి వైదొలగాల్సి వచ్చింది. మరోవైపు పాకిస్థాన్-హాంగ్ కాంగ్ మధ్య జరగాల్సిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కూడా వర్షం కారణంగా రద్దు అయింది. దీంతో మెరుగైన ఐసీసీ ర్యాంకింగ్స్ కారణంగా పాకిస్థాన్ అధికారికంగా సెమీ ఫైనల్‌లో అడుగుపెట్టింది. మంగళవారం బంగ్లాదేశ్-మలేసియా మధ్య జరగనున్న క్వార్టర్ ఫైనల్ విజేత జట్టుతో పాక్ సెమీస్‌లో తలపడనుంది. మరోవైపు శ్రీలంక-నేపాల్ జట్ల మధ్య జరగనున్న క్వార్టర్ ఫైనల్ విజేత జట్టుతో భారత్ సెమీస్‌లో పోటీ పడనుంది.

# బిజినెస్

## కంపెనీల మైండ్ గేమ్స్



ఈ-కామర్స్, రిటైల్, లాజిస్టిక్స్ రంగాలు పండుగ సీజన్ కోసం హైరింగ్ ప్రక్రియలో కీలక మార్పును అనుసరిస్తున్నాయి. ముఖ్యంగా ఫ్రంట్‌లైన్, గిగ్ వర్కర్లను ఆకట్టుకునేందుకు పండుగ బోనస్ ఇచ్చే విధానంలో కంపెనీలు భారీ మార్పులు చేపట్టాయి. ఇకపై నెలాఖరులో ఇచ్చే ఒకే పెద్ద చెక్ కాకుండా.. రోజువారీ సర్జ్ పే, వీక్లీ హాజరు రివార్డులు, స్పాట్ గిఫ్ట్ వోచర్లు, సీజన్ ముగిసే వరకు పనిచేస్తే ఇచ్చే 'మైల్‌స్టోన్ బోనస్‌ల' రూపంలో ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. అధిక డిమాండ్ సమయంలో 35-40 శాతం వరకు ఉద్యోగులు తప్పుకోవడం వల్ల కొత్తవారిని నియమించడం కంటే ఉన్నవారిని నిలుపుకోవడానికే తక్కువ ఖర్చవుతుందని భావించిన కంపెనీలు, ఇన్సెంటివ్ బడ్జెట్‌లను 15-20 శాతం పెంచాయి. మింత్రా, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలు జాయినింగ్, రిఫరల్, హెల్త్‌కేర్ బోనస్‌లను ఆఫర్ చేస్తుండగా, గంటల ప్రాతిపదికన ఇచ్చే వేతనాలు రూ. 110 నుండి రూ. 150కి పెరగడంతో పండుగ వేళ డెలివరీ వర్కర్లు నెలకు రూ. 25,000 నుండి ఎక్కువ పనిచేసే వారికి రూ. 50,000 వరకు సంపాదించే అవకాశం లభించింది.

అయితే, ఈ ఆదాయం అంత సులభం కాదని, రోజుకు 12-14 గంటలపాటు పనిచేసి కఠినమైన టార్గెట్‌లను చేరుకుంటేనే ఈ ప్రోత్సాహకాలు చేతికి అందుతాయని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ చెబుతోంది.

# బంగారం ధరలు మళ్లీ ఢమాల్..



బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది నిజంగా శుభవార్తే. గత కొంతకాలంగా పెరుగుతూ వస్తున్న ధరలకు తాజాగా బ్రేక్ పడింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన మేలిమి బంగారం 10 గ్రాములు ధరపై ఏకంగా రూ. 2,510 తగ్గడంతో, ప్రస్తుతం రూ. 1,50,170కి చేరింది. ఇక సాధారణంగా ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల బంగారంపై రూ. 2,300 తగ్గిదల నమోదై, ప్రస్తుతం రూ. 1,37,650 వద్ద కొనసాగుతోంది. ఇక పసిడి బాటలోనే వెండి కూడా భారీ పతనాన్ని చవిచూసింది. కేజీ వెండిపై ఏకంగా రూ. 5,000 తగ్గి రూ. 2,45,000కి చేరుకుంది. కాగా, తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలు, స్థానిక జ్యువెలరీ షాపులను బట్టి ఈ ధరల్లో స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉందని బులియన్ మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ధరలు ఒక్కసారిగా తగ్గడంతో పేద, మధ్య తరగతి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ కొనేందుకు ముందుకు వస్తున్నారు.

# వాట్సాప్ నుంచి మరో సరికొత్త ఫీచర్




ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ తన ఆండ్రాయిడ్ యూజర్ల కోసం మరో విజువల్ అప్‌డేట్‌ను తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఐఓఎస్ యాప్‌లో ఉన్న డిజైన్ మాదిరిగానే ఆండ్రాయిడ్ యాప్‌లో కూడా మార్పులు చేసే పనిలో పడింది. వాట్సాప్ ఆండ్రాయిడ్ బీటా వెర్షన్ (2.26.38.10)లో బాటమ్ నావిగేషన్ బార్ డిజైన్‌ను మార్చనున్నట్లుగా ప్రముఖ ఫీచర్ ట్రాకర్ 'WABetaInfo' వెల్లడించింది.

**ఫ్లోటింగ్ లేఅవుట్..**

స్క్రీన్ కింద భాగంలో కలిసిపోయే పాత డిజైన్‌కు బదులుగా, రౌండెడ్ కార్నర్స్‌తో కూడిన ఫ్లోటింగ్ లేఅవుట్ రూపంలో నావిగేషన్ బార్ ఉండనుంది. ఐఓఎస్ యాప్‌లో ఇటీవల యాపిల్ 'లిక్విడ్ గ్లాస్' ఇంటర్‌ఫేస్ ఆధారంగా ప్రవేశపెట్టిన ఫ్లోటింగ్ ట్యాబ్ బార్ డిజైన్ పోలికలతోనే దీన్ని ఆండ్రాయిడ్ కోసం డిజైన్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ డిజైన్ గైడ్‌లైన్స్ వేర్వేరుగా ఉండటంతో ట్రాన్స్‌లూసెంట్ ఫీచర్ ఆండ్రాయిడ్‌లో కాస్త భిన్నంగా ఉండవచ్చు. ప్రస్తుం ఈ ఫీచర్ ప్రస్తుతం డెవలప్‌మెంట్ దశలో ఉంది. ఇంకా బీటా టెస్టర్లకు కూడా ఇది అందుబాటులోకి రాలేదని, రానున్న అప్‌డేట్‌లో దశలవారీగా యూజర్లకు పరిచయం చేసే అవకాశం ఉందని సమాచారం.



# 6 లక్షల కోట్ల సంపద ఆవిరి

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో పెరుగుతున్న ముడి చమురు ధరల దెబ్బకు దేశీ స్టాక్ మార్కెట్ల అమ్మకాలు వెల్లువెత్తాయి. ట్రేడింగ్ ప్రారంభమైన కాసేపటికే రూ. 6 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరైపోయింది. ముడిచమురు ధరలు పెరగడంతో పాటు విదేశీ పెట్టుబడులు తరలిపోవడంతో, ఆర్థిక రంగ సంస్థల షేర్లు పతనం కావడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. సెన్సెక్స్ 1000 పాయింట్ల మేర పతనం కాగా, నిఫ్టీ 22,850 దిగువకు చేరింది. షేర్ల పతనానికి ప్రధాన కారణాలు ఏవంటే..

**ముడి చమురు ధరల ప్రభావం..**

నేడు మార్కెట్లో అమ్మకాలు పోటెత్తడానికి ప్రధాన కారణం ముడి చమురు ధరల పెరగడమేనని పరిశీలకులు చెబుతున్నారు. బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 2.20 శాతం మేర పెరిగి 106 డాలర్ల మార్కును దాటింది. ఇరాన్, అమెరికా చర్చల్లో పురోగతి లేకపోవడంతో ముడి చమురు ధరలకు రెక్కలొచ్చాయి. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు నెలకొన్నాయి. ఇది రూపాయి మారకం విలువపైనా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అంతిమంగా ఇవన్నీ కంపెనీల లాభదాయకతను దెబ్బతీస్తాయి. ముడి చమురు ధరల పెరుగుదలతో పాటు అంతర్జాతీయంగా బాండ్స్‌పై రాబడులు పెరగడం కూడా స్టాక్ మార్కెట్స్ నుంచి సంపద తరలిపోవడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు.

**ఫైనాన్షియల్ రంగ సంస్థల షేర్ల పతనం**

సోమవారం ఫైనాన్షియల్ రంగ సంస్థల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. బజాజ్ ఫైనాన్స్ సంస్థ షేరు 1.59 శాతం మేర, కోటక్ మహీంద్రా బ్యాంకు షేరు 1.38 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు 1.37 శాతం మేర పతనమయ్యాయి. ఇన్సురెన్స్ కాంపన్సేషన్ వ్యవస్థకు ఐఆర్‌డీఏ ఇటీవల కొన్ని మార్పులు ప్రతిపాదించడంతో ఈ రంగంలో అమ్మకాలు కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ రంగంతో ముడిపడ్డ కంపెనీల రాబడులపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో గత వారం కనిపించిన అమ్మకాల వెల్లువ ఈ వారం కూడా కొనసాగుతోంది.

**తరలిపోతున్న విదేశీ పెట్టుబడిదార్ల నిధులు**

విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడంతో స్టాక్ మార్కెట్లు మళ్లీ పతనం అవుతున్నాయి. యూఎస్ బాండ్స్‌పై రాబడులు పెరగడంతో పాటు ముడి చమురు ధరల పెరుగుదల నేపథ్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థికవ్యవస్థలు నెమ్మదించవచ్చన్న అంచనాతో ఫారిన్ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు.

దేశీయ ఆర్థిక రంగం బలంగా ఉన్నప్పటికీ అంతర్జాతీయ పరిణామాల ప్రభావం భారత్‌పై అధికంగా ఉందని కూడా నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. కాబట్టి, ముడి చమురు ధరలు దిగొస్తే పరిస్థితులు మళ్లీ సర్దుకునే అవకాశం ఉందని అంటున్నారు.

# అదొక అద్భుతమైన అనుభవం

హీరోయిన్‌గా నటిస్తూనే మరోవైపు స్పెషల్ సాంగ్స్‌తో అదరగొడుతోంది గ్లామర్ భామ డింపుల్ హయాతీ. ప్రస్తుతం టాలీవుడ్‌లో మోస్ట్ క్రేజీ కాంబినేషన్‌గా వస్తున్న త్రివిక్రమ్- వెంకటేష్ సినిమా 'ఆదర్శ కుటుంబం'లో ఈ అమ్మడు 'నారాయ-ణమ్మ' అని సాగే స్పెషల్ సాంగ్‌లో ఆడిపాడింది. తాజాగా, ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న డింపుల్ హయాతీ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సాంగ్ చేయడానికి మెయిన్ రీజన్ త్రివిక్రమ్ అని చెప్పింది. ఆయనతో ఇంతకుముందు పరిచయం లేకపోయినా, ఫస్ట్ టైమ్ వర్క్ చేశానని తెలిపింది. సెట్స్‌లో ప్రతీ చిన్న విషయాన్ని ఎంతో పర్‌ఫెక్ట్‌గా అబ్జర్వ్ చేస్తూ, ప్రతీ ఒక్కరికీ చాలా ఓపికగా గైడ్ చేసే తీరు తనను ఎంతగానో ఇంప్రెస్ చేసిందని చెప్పుకొచ్చింది. అదొక అద్భుతమైన అనుభవమని.. కేవలం నాలుగు రోజుల షూటింగ్‌లోనే సినిమా మొత్తం చేసినంత మజాని ఆస్వాదించానని తెలిపింది.







## 'కామ్రేడ్ కళ్యాణ్' థర్డ్ సింగిల్ అప్డేట్ ఇచ్చిన మేకర్స్

విభిన్న కథలు, డిఫరెంట్ పాత్రలతో ఎప్పుడూ ఆకట్టుకునే శ్రీవిష్ణు.. ఈసారి 'కామ్రేడ్ కళ్యాణ్' అనే సరికొత్త యాక్షన్ కామెడీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తుండగా.. ప్రముఖ రచయిత కోన వెంకట్ సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు వచ్చిన అప్‌డేట్స్, రెండు పాటలు సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేయగా.. తాజాగా మూవీ మేకర్స్ ఈ సినిమా నుంచి మరో క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలోని మ్యూజికల్ జర్నీలో భాగంగా మూడో పాటగా 'ఎత్తర ఎత్తు' అనే సాంగ్‌ను రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ లిరికల్ వీడియోను సెప్టెంబర్ 28న విడుదల చేయనున్నట్లు తెలిపారు. అంతేకాదు, 'కామ్రేడ్ అసలైన స్ఫూర్తిని అనుభవించడానికి సిద్ధంగా ఉండండి' అంటూ మేకర్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# రక్తాభిషేకం చేస్తే సినిమా హిట్ అవుతుందా



ప్రస్తుత తెలుగు చిత్రసీమలో యాక్షన్ పేరుతో వెండితెరకు రక్తాభిషేకం చేయడం ఒక కొత్త ట్రెండ్‌గా మారింది. ఒకప్పుడు కథ, కథనాలు, బలమైన భావోద్వేగాలు కమర్షియల్ విజయాన్ని నిర్ణయించేవి. కానీ ఇప్పుడు తెరపై కత్తులతో ఊచకోత కోస్తేనే, నరనరాన భయం పుట్టించేలా రక్తపాతం సృష్టిస్తేనే సినిమా హిట్ అవుతుందనే భావన పెరిగిపోతోంది. హింసను అతిగా చూపించడమే కమర్షియలిజం అనే రేంజ్‌లో మేకర్స్ రక్తాన్ని పారించడం కలవరపెడుతోంది.ఇటీవల వచ్చిన అనేక భారీ చిత్రాలలో ఓవర్ యాక్షన్, కత్తి పడితే తలలు తెగిపడటం సాధారణ విషయంగా మారిపోయాయి. 'ది ప్యారడైజ్' లాంటి సినిమాల్లో కత్తి పడితే తలలు తెగిపడేంతగా నరమేధాన్ని చూపించారు. ఇక 'టాక్సిక్' హింసకు పరాకాష్టగా చూపించారు. పవన్ కళ్యాణ్ 'ఓజీ' కమర్షియల్‌గా ఓకే అనిపించుకున్నప్పటికీ అందులోనూ వైలెన్స్ హద్దులు దాటిందనే వ్యాఖ్యలు వినిపించాయి. సందీప్ రెడ్డి వంగా 'యానిమల్' క్లైమాక్స్ సీన్ పై వచ్చిన తీవ్ర విమర్శలు, విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్ధన్' టీజర్ నిండా రక్తం నింపేయడం ఈ పరిస్థితికి నిదర్శనాలు. ఈ స్థాయి ఓవర్ యాక్షన్, విపరీతమైన రక్తం చిందించే సన్నివేశాలు ఫ్యామిలీ ఆడియన్స్‌ను తీవ్రంగా ఇబ్బందిపెడుతున్నాయి. కుటుంబ సమేతంగా థియేటర్లకు వెళ్లి హాయిగా సినిమా చూసే వాతావరణం మాయమవుతోంది. కేవలం బి-సి సెంటర్ల మాస్ క్రేజ్, కలెక్షన్ల కోసమే మేకర్స్ ఈ విధమైన హింసను ఆశ్రయిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కత్తీ-రక్తం మాత్రమే సినిమాను గట్టెక్కిస్తాయా? లేక కంటెంట్ లేని వైలెన్స్ ప్రేక్షకులకు విసుగు తెప్పిస్తుంది తప్ప ఎప్పటికి మెప్పించదు. ఈ విషయం మేకర్స్ కు ఎప్పుడు తెలుస్తుందో.

## ఇది అసలైన పోటీ అంటే..




ఇప్పటికే తెలుగులో స్టార్ హీరోలు మరియు క్రేజీ కాంబినేషన్లు పోటీపడుతుండగా, ఇప్పుడు సూపర్ స్టార్ రజనీకాంత్ సంక్రాంతి బరిలోకి అడుగుపెడుతుండటంతో బాక్సాఫీస్ వద్ద పోటీ మరింత రసవత్తరంగా మారింది. డ్యూడ్ దర్శకుడు అశ్విత్ మరిముత్తు డైరెక్షన్ లో రజనీకాంత్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం ధర్మన్. కమల్ హాసన్ నిర్మాతగా తెరకెక్కుతున్న ఈ సినిమాను సంక్రాంతికి రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. టాలీవుడ్ యంగ్ హీరో రామ్ పోతినేని ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. రజనీ సినిమాలకు తెలుగులో ఎంత భారీ మార్కెట్ ఉందో చెప్పక్కర్లేదు.రజనీ పోటీలో దిగితే తెలుగు సినిమాలకు కాస్త ఇబ్బందనే చెప్పాలి. ఓ వైపు వెంకీ -- కళ్యాణ్ రామ్, మరోవైపు చిరు మధ్యలో సూపర్ స్టార్. ఈ సంక్రాంతికి థియేటర్ల వద్ద అసలైన పండుగ వాతావరణం కలగడం ఖాయంగా కనిపిస్తోంది.



## అసలు రంగు ఏంటో తెలియనుందా?

న్యాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ లో భారీ అంచనాల నడుమ వచ్చిన చిత్రం 'ది ప్యారడైజ్'. విడుదలకు ముందే ఎంతో క్రేజ్ సొంతం చేసుకున్న ఈ చిత్రం ప్రీమియర్స్ నుండి థియేటర్లలో మిశ్రమ స్పందన తెచ్చుకుంది. ముఖ్యంగా సినిమాలోని సెకండాఫ్ పై అనేక విమర్శలు వచ్చాయి. అయితే టాక్ తో సంబంధం లేకుండా నైజాంలో మంచి వసూళ్లే రాబడుతోంది. ఇక ఇప్పటి వరకు ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది.అయితే వీకెండ్ వరకు బాక్సాఫీస్ వద్ద వేరే పెద్ద సినిమాల పోటీ లేకపోవడం, అలాగే హాలిడే అడ్వాంటేజ్ లు లభించడం, సినిమా చూసేందుకు మరే ఆప్షన్ లేకపోవడంతో 'ది ప్యారడైజ్' మంచి వసూళ్లను సాధించగలిగింది. కానీ ఈ సినిమా అసలు పరీక్ష ఇప్పుడు మొదలైంది. వర్కింగ్ డే రోజు ఎలాంటి వసూళు రాబడుతోందోనని ట్రేడ్ ఆసక్తిగా గమనిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలలో ఈ సినిమా థియేట్రికల్ రైట్స్ భారీ ధర పాలికాయి. బ్రేక్ ఈవెన్ కావాలంటే ఈ రోజు నుండి డీసెంట్ వసూళ్లు రాబట్టాలి. వీక్ డేస్ లో వర్కింగ్ డే ప్రభావం ఉన్నప్పటికీ సినిమా థియేటర్లలో బలంగా నిలబడితేనే లాభాల బాట పట్టినట్లు భావించవచ్చు. రాబోయే రోజుల్లో నాని ఈ మిక్స్ టాక్ ని సైతం అధిగమించి బాక్సాఫీస్ వద్ద ఎలాంటి పెర్ఫార్మన్స్ చూపిస్తాడో వేచి చూడాలి.




## 'మయూఖ' ట్రైలర్ అప్డేట్ ఇచ్చిన మేకర్స్

బ్యాడ్ గర్ల్స్, అమృతా అంజనా వంటి సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న పాయల్ చెంగప్ప.. ఇప్పుడు మరో వైవిధ్యమైన థ్రిల్లర్ ప్రాజెక్ట్‌తో రాబోతున్నారు. శ్రీతేజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'మయూఖ' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ పెట్టారు. ప్రశ్వితా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై శశిధర్ నల్లా ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ఇందులో మురళీగౌడ్, దేవ్, అమన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీ నుంచి మేకర్స్ తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్‌ను అనౌన్స్ చేశారు. ఇప్పటివరకు సినిమాల్లో పెద్దగా చూపించని సరికొత్త ఫ్రాగింగ్ అనే విభిన్నమైన కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలిపారు. ఈ మూవీ ట్రైలర్‌ను సెప్టెంబర్ 28న మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ ట్రైలర్ ప్రేక్షకులకు సరికొత్త ఉత్కంఠను, భిన్నమైన అనుభూతిని ఇస్తుందని చిత్రబృందం చెబుతోంది.

## అన్‌లక్కీ హీరోయిన్‌గా ముద్రవేశారు..

ఒకానొక సందర్భంలో సినిమా షూటింగ్‌కు డేట్స్ అన్నీ లాక్ చేసుకున్న తర్వాత తనను ప్రాజెక్ట్ నుంచి తీసేశారని చెప్పారు. అసలు కారణం ఏంటని తాను పదే పదే ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానం చెప్పలేదని, బహుశా ఆ హీరోకు తనకు ఇష్టమైన మరో హీరోయిన్‌ను తీసుకోవాలనిపించి ఉండవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.అయితే తనకు కెరీర్‌లో ఎదురైన వాటిలో అత్యంత చెత్త కారణం ఏమిటంటే.. "హీరో భార్యకు నువ్వంటే ఇష్టం లేదు, అందుకే నిన్ను సినిమా నుంచి తొలగించాం" అని చెప్పడమేనని తాప్సీ షాకింగ్ నిజం బయటపెట్టారు. ఒకనొక దశలో, తన సినిమాలు వరుసగా విఫలమయ్యాక, తనను అన్‌లక్కీ హీరోయిన్‌గా ముద్రవేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే, సినిమాల్లో గ్లామర్ పాత్రల గురించి మాట్లాడుతూ.. తాను మొదట్లో సినిమాల్లో నటించేటప్పుడు ఆ సన్నివేశాలు ఏ విధంగా వస్తాయో సరిగ్గా అర్థమయ్యేది కాదని అన్నారు. కానీ సినిమా తెరపై చూసిన తర్వాత కొన్ని సీన్లు మరీ ఎక్కువగా, అసహజంగా చూపించినట్లు అనిపించిందని వాపోయారు. ఏ సినిమాలోనైనా అందంగా, గ్లామర్‌గా కనిపించవచ్చు కానీ.. దాన్ని అనవసరంగా అసభ్యకరంగా చూపించడం సరికాదని తాప్సీ అభిప్రాయపడ్డారు. ఇండస్ట్రీలో హీరోయిన్లు ఎదుర్కొంటున్న ఈ తీరుపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.




Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**